ప్రజాశక్తి

గురువారం 11 డిసెంబరు 2025 8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా

వైసిపి, టిడిపి సభ్యుల మధ్య వాగ్వాదం

అట్టుడికిన కౌన్సిల్...

- అరుపులు...కేకలు...నిరసనలు, సస్పెన్షన్లు
- ఇళ్లు నిర్మించకపోగా...ఉన్న ఇళ్లనే కూల్చివేస్తారా..?
- అర్బన్ ప్రాంతంలో రెండు సెంట్ల స్థలాల కేటాయింపు ఏదీ ?
- మూడు అంశాలపై స్తంభించిన సమావేశం

సిపిఎం ఫ్లోర్‌లీడర్ సత్యబాబు

కమిషనర్ ధ్యానచంద్ర

మేయర్ భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి - విజయవాడ : నగరపాలక సంస్థ సాధారణ సర్వసభ్య సమావేశం అట్టుడికింది. పలు అంశాలపై సభ్యుల అరుపులు, కేకలు, అధికార, ప్రధాన ప్రతిపక్ష సభ్యుల మధ్య పరస్పర వ్యతిరేక నినాదాల హోరుతో దద్దరిల్లింది. మేయర్ పోడియం వద్ద నిరసనలు, బాయ్‌కాట్‌లు, సభ్యుల సస్పెన్షన్లు, వాదోపవాదాలు, పత్రాలను చించివేయడం వంటి సంఘటనల నడుమ హాట్‌హాట్‌గా కౌన్సిల్ సమావేశం సాగింది. ఈక్రమంలో ప్రజాసమస్యలపై చర్చ పక్కదారి పట్టింది. మేయర్ రాయన భాగ్యలక్ష్మి అధ్యక్షతన విఎంసి కౌన్సిల్ సమావేశం బుధవారం జరిగింది. ఎన్నికల హామీలను తుంగలో తొక్కి అర్హులకు ప్రస్తుత కూటమి ప్రభుత్వం, గత వైసిపి ప్రభుత్వం ఏళ్ల తరబడి ఇళ్ల కేటాయించకపోవడం, డ్వాక్రా పొదుపు సంఘాల నిర్వహణలో పెద్దఎత్తున చోటు చేసుకుంటున్న అవినీతి అక్రమాలు, 27వ డివిజన్‌లోని కళ్యాణ మండపానికి తెలంగాణా పోరాట యోధురాలు 'చిట్యాల ఐలమ్మ' పేరుతో బోర్డు ఏర్పాటు చేయాలని కౌన్సిల్ చేసిన తీర్మానం అమలు కాకపోవడం వంటి అంశాలపై వాడీవేడిగా చర్చ నడిచింది. అలాగే అనూహ్యరీతిలో సమావేశం మధ్యలో తెరపైకి 88 కె ద్వారా అధికార వైసిపి తీసుకొచ్చిన రాష్ట్రంలో పిపిపి పద్ధతిలో మెడికల్ కళాశాలలు ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం, వన్‌టౌన్ జోజినగర్‌లో కూల్చివేసిన 42 గృహాల అంశాలు వైసిపి, టిడిపి మధ్య పెద్దఎత్తున రగడకు దారితీసింది. ఈ రెండు అంశాలు చుట్టూతే గంటకు పైగా సమావేశాన్ని నడిపారు. ఈ అంశాలపై సమావేశం స్తంభించింది. అటు వైసిపి, ఇటు టిడిపి సభ్యులు ఒకరి వైఫల్యాలను మరొకరు ఎత్తిచూపుకోడం, పరస్పరం విమర్శలు చేసుకోవడం, డౌన్ డౌన్ అంటూ రెండు పార్టీల సభ్యుల నినాదాలతో కౌన్సిల్ హోరెత్తింది. ఎంతో విలువైన సమయాన్ని వృథా చేస్తున్నారని, చర్చించాల్సిన ప్రజాసమస్యలు అనేకం ఉన్నాయని సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశ్నోత్తరాల సమయంలో గృహ నిర్మాణాలు, కేటాయింపు అంశంపై సత్యబాబు వేసిన ప్రశ్న ఇటు టిడిపి, అటు వైసిపిని ఇరుకున పెట్టింది. గత ఐదారేళ్లలో అధికారంలో ఉన్న ఈ రెండు పార్టీల ప్రభుత్వాలు పేదలను మోసం చేశాయని విమర్శించారు. వీటిపై అధికారులిచ్చిన నివేదికపై సత్యబాబు మండిపడ్డారు. ఇల్లు లేని ప్రతి పేదవాడికి ఇళ్ల కేటాయిస్తామని ఎన్నికల్లో వాగ్దానం చేసి, గెలిచిన తర్వాత ఉన్న ఇళ్లను కూల్చే బుల్డోజర్ సంస్కృతి విజయవాడకు కూడా పాకడం దురదృష్టకరమని అన్నారు. కూటమి ప్రభుత్వం అర్బన్‌ప్రాంతంలో రెండు సెంట్ల చొప్పున స్థలాలు కేటాయిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిందని గుర్తుచేశారు. దీంతో ఇళ్ల నిర్మాణం, కేటాయింపులో "మీరు వైఫల్యం చెందారంటే...మీరు వైఫల్యం చెందారంటూ" టిడిపి, వైసిపి సభ్యులు విమర్శలు, ప్రతివిమర్శలు చేసుకున్నారు. ఇళ్లు ఇప్పిస్తామని చెప్పి లక్ష నుండి రెండు మూడు లక్షల రూపాయల వరకు మధ్య దళారులు వసూలు చేస్తున్నారని వైసిపి సభ్యులు జానారెడ్డితోపాటు రామిరెడ్డి, అడపా శేషు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. గృహ నిర్మాణం కోసం గత వైసిపి పాలనలో రూ.26 కోట్లు నిధుల మంజూరు చేసినట్లు మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేటర్ పుణ్యశీల పేర్కొన్నారు. పాత లబ్ధిదారుల స్థానంలో కొత్త వారికి ఇళ్లకేటాయిస్తారనే భయాందోళన అక్కరలేదని కమిషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. మార్చి 15 నాటికి కొన్ని గృహాలు, వచ్చే మార్చి చివరి నాటికి మరికొన్ని టిడ్కో గృహాలను లబ్ధిదారులకు కేటాయిస్తామని హౌసింగ్ డిఇ తెలిపారు. పన్నుల భారం మోపబోమని గత ఎన్నికల్లో ఇచ్చిన హామీకి విరుద్ధంగా ఇంటింటి సర్వేల పేరుతో 20 శాతం ఆస్తిపన్ను పెంచాలని మున్సిపల్ శాఖ ఇచ్చిన జీఓను వెంటనే విరమించుకోవాలని సత్యబాబు డిమాండ్ చేశారు. ఇప్పటికే మంచినీరు, డ్రైనేజి ఛార్జీలు పెరిగాయన్నారు. సిపిఎస్ ఉద్యోగులకు ఇవ్వాలని డిఎలను సక్రమంగా విడుదల చేయాలన్నారు. పైపుల ద్వారా వస్తున్న దుర్వాసన, బురద, రంగు మారిన నీటిని ప్రజలు తాగాల్సి వస్తోందని, ఈనేపథ్యంలోనే పాత ఆర్‌ఆర్‌పేట, న్యూ ఆర్‌ఆర్‌పేట ప్రజలు ఇప్పటికే అతిసార బారిన పడ్డారని, ఇదే పరిస్థితి నగరవ్యాప్తంగా ఉందని టిడిపి ఫ్లోర్‌లీడర్ నెల్లిబండ్ల బాలస్వామి, సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు, సభ్యులు జాస్తి సాంబశివరావు, పూర్ణచంద్రరావు తదితరులు ఆందోళన వ్యక్తం చేశారు.

నకిలీ డ్వాక్రా గ్రూపులు : ఆందోళన వ్యక్తం చేసిన సభ్యులు

నకిలీ డ్వాక్రా గ్రూపులు యథేచ్ఛగా వెలుస్తూ భారీ మొత్తంలో అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నా నగరపాలక సంస్థలోని యుసిడి విభాగం అధికారులు చేష్టలుడిగి చూస్తున్నారని, వీటిపై సమగ్ర విచారణ జరిపించి, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని పార్టీలకతీతంగా సభ్యులు కౌన్సిల్ సమావేశంలో డిమాండ్ చేశారు. డ్వాక్రా పొదుపు సంఘాల్లో జరుగుతున్న అవినీతి అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు తీసుకొచ్చిన ప్రతిపాదనపై సభ్యులు తీవ్రస్థాయిలో చర్చించారు. వన్‌టౌన్‌లోని 46, 49, 53 డివిజన్లతోపాటు నగరవ్యాప్తంగా పెద్దఎత్తున నకిలీ డ్వాక్రా గ్రూపులు ఏర్పడుతూ ఆయా గ్రూపు

(మిగతా 2లో)

అప్పుల ఊబిలో కౌలు రైతులు

- మొంథా తుపానుకు భారీగా తగ్గిన ధాన్యం దిగుబడులు
- రెండో పంట అపరాలపైనే ఆశలు

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

మొంథా తుపాను ప్రభావంతో ధాన్యం దిగుబడులు భారీగా తగ్గిపోయాయి. ఎకరాకు 10 నుంచి 15 బస్తాల (బస్తా 75 కిలోలు) మేర దిగుబడి తగ్గిపోయింది. మరోపక్క నాణ్యతా ప్రమాణాలను సాకుగా చూపుతూ రైతులకు చెల్లించాల్సిన కనీస మద్దతు ధరల్లోనూ మిల్లర్లు భారీగా కోత పెడుతున్నారు. దిగుబడులు, ధాన్యం ధర తగ్గినా కౌలు చెల్లింపులు మాత్రం వారికి తప్ప లేదు. ఈనేపథ్యంలో సొంత భూమిలో వ్యవసాయం చేసే రైతుతో పోల్చుకుంటే కౌలు రైతుకు రెట్టింపు నష్టం వాటిల్లుతోంది. కొందరు కౌలు రైతులకు పండిన ధాన్యం మొత్తం భూ యజమానికి చెల్లించడానికి సరిపోతోంది. పెట్టిన పెట్టుబడిలో ఒక్కరూపాయి చేతికి తిరిగిరావడంలేదు. ఖరీఫ్ సీజన్లో దుక్కులు, దమ్ములు, ఎరువులు, పురుగు, తెగుళ్ల మందుల ధరలు పెరగడంతో పెట్టుబడి వ్యయం భారీగా పెరిగింది. ఉదాహరణకు మూడున్నర ఎకరాలు కౌలు చేసిన రైతులు సైతం లక్ష రూపాయలకుపైగా అప్పుల పాలయ్యారు. కొండలా పేరుకుపోయిన అప్పులను చూసి ఆందోళన చెందుతున్నారు. రెండో పంట రబీలో సాగు చేస్తున్న అపరాలైనా తమను అప్పుల ఊబి నుంచి గట్టెక్కిస్తాయని ఆశలు పెట్టుకుంటున్నారు.

కౌలు రైతు వ్యధ

కృష్ణాజిల్లా కోడూరు శివారు ఇస్మాయిల్‌బేగ్ పేటకు చెందిన కోట నాగరాజు ఎకరాకు 19 బస్తాలు ధాన్యం చెల్లించే ఒప్పందంపై ఐదు ఎకరాలు కౌలుకు చేస్తున్నారు. బిపిటి 5204 రకం సాగు చేశారు. గత ఏడాది 75 కిలోల బస్తాలు ఎకరాకు 36 బస్తాల చొప్పున దిగుబడి వచ్చింది. బస్తా రూ.1800లకు విక్రయించారు. ఈ ఏడాది ఎకరాకు రూ.37 వేల చొప్పున ఐదెకరాలకు రూ.1.85 లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. ఎకరాకు 27 బస్తాలు మాత్రమే దిగుబడి వచ్చింది. 19 బస్తాలు కౌలు చెల్లించగా ఎకరాకు ఎనిమిది బస్తాల చొప్పున ఐదు ఎకరాలకు 40 బస్తాలు మిగిలాయి. బస్తా రూ.1420 చొప్పున విక్రయిస్తే రూ.56,800 మాత్రమే చేతికి వచ్చాయి. దీంతో రూ.1.29 లక్షల వరకు నష్టపోయారు. ఘంటసాల మండలం కొత్తపల్లికి చెందిన మేడంకి బాబూరావు 3.50 ఎకరాల్లో ఎంటియు 1318 రకం వరి సాగు చేశారు. ఎకరాకు 22 బస్తాల చొప్పున దిగుబడి వచ్చింది. ఈ మొత్తం భూ యజమానికి కౌలు చెల్లింపుకే సరిపోయింది. ఎకరాకు రూ.35 వేల చొప్పున 3.50 ఎకరాలకు లక్షా 22 వేల 500 రూపాయలు నష్టపోయారు. మొవ్వ మండలం చినముత్తేవికి చెందిన కె.సాయికుమార్ 13 ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేశారు.

ఎంటియు 1318 రకం వరి సాగు చేశారు. ఎకరాకు 36 వేల చొప్పున రూ.4.68 లక్షలు పెట్టుబడి పెట్టారు. గతేడాది ఎకరాకు 42 బస్తాలు దిగుబడి రాగా, ఈ ఏడాది మాత్రం 30 బస్తాలు మాత్రమే దిగుబడి వచ్చింది. మానుగాయ వచ్చిందని చెప్పి మిల్లర్లు బస్తా 1200 రూపాయలకు కొనుగోలు చేశారు. 19 బస్తాలు కౌలు చెల్లించారు. 13 ఎకరాలకు 143 బస్తాలు మిగిలాయి. దీనికిగాను లక్షా 71 వేల 600 రూపాయలు మాత్రమే చేతికొచ్చాయి.

వరి రైతుకు తేమ తిప్పలు

- ధాన్యం కొనుగోళ్లపై ప్రభావం
- మిల్లర్ల మాయాజాలంతో విలవిల

ప్రజాశక్తి-ఘంటసాల: రెక్కలు ముక్కలు చేసుకుని పండించిన పంట చేతికొచ్చే సమయానికి అన్నదాతకు కన్నీళ్లే మిగులుతున్నాయి. ఒకవైపు అకాల వర్షాలు రైతులను దెబ్బతీస్తుంటే, మరోవైపు తేమ శాతం నిబంధన రైతు మెడకు ఉరితాడులా మారింది. ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటిస్తున్న గిట్టుబాటు ధర క్షేత్రస్థాయిలో ఎక్కడా అమలు కావడం లేదు. మిల్లర్ల మాయాజాలం, అధికారుల నిర్లక్ష్యం నడుమ రైతులు మోసపోతున్నారు. రైతు సేవా కేంద్రాల నిబంధనల ప్రకారం ధాన్యంలో తేమ 17 శాతం వరకు ఉండవచ్చు. క్షేత్రస్థాయిలో మిల్లుల దగ్గర తేమను ఎక్కువగా చూపిస్తున్నారు. 17 శాతం ఉండాల్సిన తేమను సాకుగా చూపి అంతకంటే ఒక్క శాతం ఎక్కువ ఉన్నా ప్రతీ శాతానికి ఒక కిలో చొప్పున కోత విధిస్తున్నారు. తేమ పేరు చెప్పి దాదాపు క్వింటా ధాన్యానికి 7 నుండి 8 కిలోల వరకు తరుగు తీస్తున్నారు. అంటే రైతు కష్టపడి పండించిన పంటలో గణనీయమైన భాగం ఉచితంగా మిల్లర్ల పాలవుతోంది. ఈ తరుగు లెక్కల కారణంగా ఒక్కో బస్తాకు రైతు సుమారు రూ.150 నుంచి రూ.200 వరకు నష్టపోవాల్సి వస్తోంది.

ధాన్యం కొనుగోలు చేసే సమయంలో నమోదు చేసే 'ట్రక్ షీట్'లోనే అసలు మోసం జరుగుతోంది. రైతు సేవా కేంద్రాల్లోనే ధాన్యం పరిమాణాన్ని తక్కువ చేసి నమోదు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. వాస్తవ పరిమాణం కన్నా తక్కువ నమోదు చేయడం వల్ల, మిల్లర్లకు అదనపు ధాన్యం సులభంగా దక్కుతోంది. దీనివల్ల రికార్డుల్లో అంతా సక్రమంగా ఉన్నట్లు కనిపిస్తున్నా, రైతు మాత్రం తీవ్రంగా నష్టపోతున్నాడు.

ప్రకటనలకే పరిమితమైన మద్దతు

రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తామని, ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలు నీటి మూటలుగానే మిగిలిపోతున్నాయి. వర్షానికి తడిసిన ధాన్యాన్ని సాకుగా చూపి దళారులు, మిల్లర్లు సిండికేట్‌గా మారి తక్కువ ధరకే పంటను కొల్లగొడుతున్నారు. ఘంటసాల మండలంలో మాయాజాలంపై

(మిగతా 2లో)

జోష్‌గా సంగీత విభావరి

విజయవాడ : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 69వ వర్ధంతిని అంబేద్కర్ సాంస్కృతిక- సామాజిక సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం రాత్రి స్థానిక గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదికపై సినీ సంగీత విభావరి జోష్‌గా జరిగింది. కె.డేవిడ్ రాజు, ఎ.జయప్రభు, పి.శ్రీనివాసరావు, మారేపల్లి జోషి, పి.జోసఫ్, ప్రిన్స్, మల్లేశ్వరి, సుమలత తదితర ఔత్సాహిక గాయనీ గాయకులు పాడిన పాటలు ప్రేక్షకుల్ని అలరించాయి. కార్యక్రమానికి అతిథులుగా చింతా వెంకటేశ్వర్లు, డాక్టర్ పరుచూరి విజయలక్ష్మి, ప్రసన్నా రామన్, చిట్టిబాబు, యు.వి.రత్నం, ఆర్.మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు. సంస్థ కోశాధికారి బి.వి.వీరభద్రరావు ప్రోగ్రాం కన్వీనర్‌గా వ్యవహరించారు. రాయరాజు, కారుమంచి రాజు పర్యవేక్షించారు. కొప్పుల అశోక్ ఆనంద్ వ్యాఖ్యానం కార్యక్రమాన్ని మరింత ఆసక్తిదాయకంగా నడిపింది. లైవ్ ఆర్కెస్ట్రా: కీబోర్డ్- రవిబాబు, తబలా- విజయ్ పాల్, ప్యాడ్స్- వెంకటరమణ, కాంగో- టేపు- సింగంపల్లి రమణ, రిథమ్స్- రామ్మోహన్, సౌండ్ డీజే రాము.

విజయవాడలో జగన్ పర్యటన

జమలపూర్ణమ్మకు పరామర్శ

విజయవాడ : వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి బుధవారం విజయవాడ నగరంలో పర్యటించారు. ఎన్‌టిఆర్ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్‌పర్సన్, వైసిపి మహిళా నాయకురాలు తిప్పరమల్లి జమలపూర్ణమ్మ ఇటీవల అనారోగ్యం బారిన పడి చికిత్స చేయించుకున్నారు. ఈ నేపథ్యంలో వై.ఎస్.జగన్ ఆమెను పరామర్శించారు. కేదారేశ్వరపేటలోని జమలపూర్ణమ్మ నివాసానికి వెళ్లిన ఆయన...ఆమె ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. అధైర్యపడొద్దని, పార్టీ అండగా ఉంటుందని ఆమెకు భరోసా ఇచ్చారు. ఆమె ఆరోగ్య స్థితిపై ఎప్పటికప్పుడు వాకబు చేయాలని స్థానిక నేతలకు పురమాయించారు. వై.ఎస్.జగన్ రాకతో లోటస్ రోడ్లు కిటకిటలాడాయి. పార్టీ కార్యకర్తలు జగన్‌ను చూసేందుకు భారీగా తరలివచ్చారు.

వరి రైతుకు తేమ తిప్పలు

(మొదటి పేజీ తరువాయి)

జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోలేదని రైతులు ఆరోపిస్తున్నారు. బయట నుండి లారీలపై వచ్చిన ధాన్యాన్ని మాత్రమే దిగుమతి చేస్తూ స్థానిక రైతులకు సంబంధించిన ధాన్యాన్ని దిగుమతి చేయకుండా రోజుల తరబడి నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అక్రమాలకు పాల్పడుతున్న మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, ధాన్యాన్ని ఎలాంటి షరతులు, కోతలు లేకుండా కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

నకిలీ డ్వాక్వా గ్రూపులు

(మొదటి పేజీ తరువాయి)

సభ్యులు లక్షలాది రూపాయల మేర అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని సత్యబాబు మండిపడ్డారు. దీంతో ఆయా గ్రూపుల సభ్యులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. వన్‌టౌన్‌కు చెందిన అక్షయ గ్రూపు, లక్ష్మీ గ్రూపుతోపాటు మరికొన్ని గ్రూపులు ఆర్థిక అరాచకాలకు పాల్పడుతున్నట్లు తన వద్ద పక్కా ఆధారాలున్నాయని చెప్పారు. సంబంధిత అధికారులు ఏం చేస్తున్నారని ఆయన నిలదీశారు. ఈ అవినీతి భాగోతాన్ని అధికారులు పక్కదారి పట్టించే రీతిలో మాట్లాడటం బాధాకరమన్నారు. ఈ అవినీతి అక్రమాల్లో కింద స్థాయి నుంచి పైస్థాయి దాకా సంబంధిత అధికారుల చేతివాటం ఉందని, రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధుల ప్రమేయంతోనే ఇవ్వన్నీ జరుగుతున్నాయని సత్యబాబు పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రజల సొమ్ము లూఠీ కాకుండా సమగ్ర విచారణ జరిపించాలని, దోషులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రూరల్ ప్రాంతాల్లోని మహిళలు కూడా నగర పరిధిలోని డ్వాక్వా గ్రూపుల్లో ఉంటున్నారని, ఇలా ఉండవచ్చా అని పిఒ యుసిడి వెంకటరమణను నగర మేయర్ ప్రశ్నించారు. అలా ఉండకూడదని పిఒ సమాధానమిచ్చారు. అనేక చోట్ల ఇలా ఉంటున్నట్లు తన దృష్టికి వచ్చిందని మేయర్ పేర్కొన్నారు. యుసిడి విభాగం వైఫల్యం కారణంగానే దొంగ డ్వాక్వా గ్రూపులు ఏర్పడుతూ భారీ మొత్తంలో అక్రమాలు జరుగుతున్నాయని సత్యబాబు చెప్పిన విషయాలన్నీ వాస్తవమేనని వైసిపి కార్పొరేటర్ పూర్ణ చంద్రరావు పేర్కొన్నారు. డ్వాక్వా పొదుపు సంఘాల్లో పెద్దఎత్తున కాల్‌మనీ వ్యవహారం నడుస్తుందని, దీనిపై సమగ్ర విచారణ జరిపితే అధికారుల బండారం బయటపడుతుందని బిజెపి సభ్యులు బుల్లా విజయ్‌కుమార్ పేర్కొన్నారు. దీనిపై పిఒ వెంకటరమణ సమాధానమిస్తూ బ్యాంక్‌లు పేమెంట్లు ఇచ్చే సందర్భంలోనే అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని, ఇటువంటి అక్రమాలపై 15 రోజుల్లో సమగ్ర విచారణ జరిపించి, దోషులెవరో తేలుస్తామని హామీనిచ్చారు. 2009లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో అమలు చేసిన అభయహస్తం స్కీమ్ కింద చెల్లించిన డబ్బులు తాలూకా అనేక మందికి నేటికీ అవి జమ కాలేదని, ఇప్పటికైనా బాధితులకు మంజూరు చేయాలని సత్యబాబు కోరారు.

దోమకాటుతో పెరుగుతున్న రోగులు

గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలో దోమలపై యుద్ధం చేసినా...అదే టిడిపి నేడు అధికారంలో ఉన్నా 24/7 మాదిరిగా తయారైందని, పగలూ రాత్రి అనే తేడా లేకుండా ప్రజలు దోమ కాటుకు గురవుతున్నారని సిపిఎం ఫ్లోర్‌లీడర్ సత్యబాబు పేర్కొన్నారు. దోమకాటుతో బోధకాలు రోగుల సంఖ్య పెరుగుతున్నట్లు హెల్త్ సెక్రటరీల నుంచి సమాచారం అందుతోందని ఆయన కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. కృష్ణలంక, రాణిగారితోట, రామలింగేశ్వర్‌నగర్ ప్రాంతాల నుంచి నిత్యం నగరంలోకి రాకపోకలు చేయాలంటే కాల్వలపై ఉన్న వంతెనలే ఆధారమని, అవి శిథిలావస్థకు చేరి, ప్రమాదకరంగా తయారయ్యాయని డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, వైసిపి సభ్యులు రామిరెడ్డి, అడపా శేషు పేర్కొన్నారు. అవి ట్రాఫిక్‌కు కూడా సరిపోవడం లేదని, సత్వరమే పెరిగిన అవసరాలకనుగుణంగా కాల్వలపై కొత్తగా వంతెనల నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇదే రీతిలో నగరంలోని మిగిలిన కాల్వలపైనా వంతెనలు నిర్మించాలని సభ్యులు జానారెడ్డి కోరారు. దీనిపై ఇన్చార్జి చీఫ్ ఇంజినీర్ సత్యవతి మాట్లాడుతూ ఎంతో ప్రాధాన్యత కలిగిన వంతెన నిర్మాణం అంశాన్ని మరోసారి చర్చించి, వాటి ఏర్పాటుకు అవసరమైన ప్రణాళికను తయారు చేస్తామని చెప్పారు.

వెహికల్ డిపోలో అక్రమాలపై విచారణ జరపాలి

పలువురు సభ్యులు డిమాండ్

ప్రజాశక్తి - విజయవాడ : నగరపాలక సంస్థ వెహికల్ డిపోలో వాహనాల నిర్వహణ దగ్గర నుంచి ఆయిల్ చోరీ, అద్దె వాహనాలకు చెల్లించే నిధులు, స్పేర్‌పార్టుల కొనుగోలులో చోటుచేసుకుంటున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని పలువురు సభ్యులు పట్టుపట్టారు. వెహికల్ డిపో నిర్వహణ, వాహనాల వినియోగిస్తున్న తీరు, నెలవారీ ఖర్చులు, సిబ్బంది, అధికారుల సంఖ్య తదితర అంశాలపై సమగ్ర సమాచారం ఇవ్వాలని టిడిపి సభ్యులు ముమ్మనేని వెంకట ప్రసాద్ వేసిన ప్రశ్నపై కౌన్సిల్‌లో చర్చ నడిచింది. బుధవారం జరిగిన విజయవాడ నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో ఏడాదికి రూ.21 కోట్లు ఖర్చు చేస్తున్నా వెహికల్ డిపోలోని అనేక వాహనాల నిర్వహణ, వాటి మరమ్మతులు సరిగా లేక పారిశుధ్య పనులకు అందుబాటులో లేకుండా పోతున్నాయని, వీటిపై పలుసార్లు అధికారుల దృష్టికి తీసుకొస్తున్నా పట్టించుకోవడం లేదని ముమ్మనేని ప్రసాద్ మండిపడ్డారు. కేవలం ఒక గంట పని చేసి రోజంతా పని చేసినట్లు రికార్డుల్లో రాస్తున్నట్లుగా తాను ప్రత్యక్షంగా గమనించానని వైసిపి కార్పొరేటర్ జానారెడ్డి పేర్కొన్నారు. సిఎన్‌జి ఆటోలు దగ్గర నుంచి బిగ్ కాంపాక్టర్లు, ఎయిటెక్ మిషన్లు తదితర అనేక రకాల వాహనాలు సరిగా అందుబాటులో ఉండటం లేదని, అద్దె వాహనాలను కూడా సరిగా ఉపయోగించుకోవడం లేదని సభ్యులు పేర్కొన్నారు. ప్రజారోగ్య విభాగంలో పనిచేస్తున్న 74 మంది కార్మికులను 60 సంవత్సరాలు నిండాయనే పేరుతో ఎటువంటి బెనిఫిట్స్ ఇవ్వకుండానే ఇంటికి పంపించే పని చేస్తున్నారని ముమ్మనేని పేర్కొన్నారు. ఆధార్‌కార్డుల్లో తప్పులతో అనేక మంది కార్మికులకు అన్యాయం జరుగుతోందన్నారు. వీటిని సరి చేసి కార్మికులకు న్యాయం చేయాలని సత్యబాబు, ప్రసాద్ తదితర సభ్యులు కోరారు. కమిషనర్ స్పందిస్తూ తప్పులను తన దృష్టికి తీసుకొస్తే న్యాయం జరిగేటట్లు చేస్తానన్నారు. టైమ్ స్కేల్ ఉద్యోగులకు రావాల్సిన బెనిఫిట్స్‌ను సుప్రీంకోర్టుకు వెళ్లి కూడా సాధించుకుంటే వాటిని చెల్లించడానికి విఎంసి మీనమేషాలు లెక్కిస్తోందని, నేటికీ అనేక మంది బెనిఫిట్స్ తీసుకోకుండానే మృత్యువాత పడ్డారని సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు అన్నారు. కృష్ణలంక స్వర్గపురి (శ్మశాన వాటికి)తోపాటు సింగ్‌నగర్‌లోని పాయకాపురం, ఇతర శ్మశాన వాటికల నిర్వహణ, వాటి అభివృద్ధి అధ్వానంగా తయారైందని టిడిపి డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు అన్నారు. కృష్ణలంక స్వర్గపురిలో శవాలు కాల్చడానికి వీలుగా బెడ్స్ లేవని, వాటిని అభివృద్ధి చేయాలని స్థానిక కార్పొరేటర్ తాటిపర్తి కొండారెడ్డి కోరారు. జోజినగర్‌లో కూల్చివేసిన 42 గృహాల పరిస్థితిపై మధ్యాహ్నం భోజనం విరామ సమయంలో వైసిపి కార్పొరేటర్లు వెళ్లి పరిశీలించి కౌన్సిల్ సమావేశానికి హాజరయ్యారు.

సత్యబాబు నిరసన ర్యాలీ

ప్రజాశక్తి - విజయవాడ

వైసిపి, టిడిపి కూటమి భారాల బాదుడు, నిధుల సాధనలో పాలకుల వైఫల్యం...అభివృద్ధికి అగాధం- కార్పొరేషన్ అప్పులపాలు అంటూ సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు నిరసన ర్యాలీ చేశారు. విఎంసి కార్యాలయం ప్రాంగణంలో కౌన్సిల్ సమావేశానికి ముందు కౌన్సిల్ హాలు వెలుపుల నినాదాలతో కూడిన ఫ్లెక్సీని చేబూని ర్యాలీగా కౌన్సిల్‌కు చేరుకున్నారు.

ఇరకాటంలో కమిషనర్

- టిడిపి సభ్యురాలు ఉషారాణి సస్పెన్షన్‌పై రగడ

ప్రజాశక్తి - విజయవాడ : కౌన్సిల్ సమావేశం సందర్భంగా విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర ఇరకాటాన్ని ఎదుర్కొన్నారు. 'పిల్లికి చెలగాటం...ఎలుకకు ప్రాణ సంకటం' అన్న చందంగా కౌన్సిల్‌లో కమిషనర్ పరిస్థితి తయారయిందని చెప్పక తప్పదు. డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ వద్ద నుంచి టిడిపి సీనియర్ కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి మైక్‌ను బలవంతంగా లాక్కొని వెళ్లడమేగాక, సభామర్యాదలు పాటించలేదని, ఆమెను సమావేశం నుంచి సస్పెండ్ చేయాలని వైసిపి ఫ్లోర్‌లీడర్ సత్యనారాయణ అధ్యక్షస్థానంలో ఉన్న మేయర్ భాగ్యలక్ష్మిని కోరారు. దీంతో కార్పొరేటర్ ఉషారాణిని బయటకు తీసుకెళ్లాలని లేడీ మార్షల్స్‌ను మేయర్ ఆదేశించారు. ఉషారాణిని బయటకు తీసికెళ్లడాఇకి లేడీ మార్షల్స్‌కు ఆమె వద్దకు చేరుకున్నారు. అయితే పక్కనే ఉన్న టిడిపి సభ్యులు చెన్నుపాటి ఉషశ్రీతోపాటు ముమ్మనేని ప్రసాద్, పలువురు సభ్యులు లేడీ మార్షల్స్ వెంటనే అక్కడి నుండి వెళ్లిపోవాలని, ఉషారాణిని బయటకు తీసికెళ్లడానికి వీలు లేదని అన్నారు. చేసేది లేక ఉషారాణి పక్కనే మార్షల్స్ ఉండిపోవాల్సి వచ్చింది. సమయం గడుస్తున్నా... ఫలితం లేకపోవడంతో... ఉషారాణిని తీసికెళ్లాలని మార్షల్స్‌ను ఆదేశించాలంటూ అధ్యక్ష స్థానంలో ఉన్న నగర మేయర్ పలుసార్లు కమిషనర్‌ను కోరారు. అయినా ఆయన సైలెంట్‌గా ఉండిపోయారు. దీంతో ఒకానొక దశలో కమిషనర్ వైఖరిపట్ల మేయర్ అసహనం వ్యక్తం చేశారు. మార్షల్స్ కూడా ఏమి చేయలేని స్థితిలో ఉషారాణి సస్పెన్షన్ కాకుండానే అలాగే సమావేశ ముగిసేంత వరకు ఉండిపోయారు. అయితే వచ్చే సమావేశానికి ఉషారాణిని రానీయ కూడదని మేయర్ సంబంధిత సెక్రటరీ సెల్ అధికారులను ఆదేశించడం గమనార్హం.

CHANGE OF NAME

I, SHAIK ISHAQ, S/O. SHAIK IBRAHEEM (Old Name), residing at D.No. 5-1, Near Masjid, Ganiatukuru, NTR District, Andhra Pradesh-521180. My Name has been changed to **MOHAMMAD ISHAQ SHAIK, S/O. SHAIK IBRAHEEM (New name)**. Here after my name is known as **MOHAMMAD ISHAQ SHAIK, S/O. SHAIK IBRAHEEM (New name).**

CHANGE OF NAME

I, MAMTA KUMARI, W/O. KANTILAL JAIN (Old Name), residing at D.No. 11-28-1/32, Near Jain Temple, One Town, Vijayawada, NTR District, Andhra Pradesh - 520001. My Name has been changed to **MAMATA JAIN, W/O. KANTILAL JAIN (New name)**. Here after my name is known as **MAMATA JAIN, W/O. KANTILAL JAIN (New name).**

స్థలం కొనుగోలుపై అభ్యంతరాలు తెలపండి

గొల్లపూడి గ్రామంలో మౌలానగర్లో 594/1 సర్వే నంబర్ లో ప్లాట్ నెంబరు 84 గల 166.5 చదరపు గజములు. పేదర్ల వెంకటరామయ్య గారి కుమారుడు పేదర్ల రాజారావు గారు గొల్లపూడి వాస్తువులు వారికి చెందినది ఈ యొక్క ఆస్తిని నా క్లైంట్ అయినా అజ్గర్ అలీ బహిలీన్ గారు కొనుగోలు చేయుచున్నారు దీనికి సంబంధించిన ఏవైనా ఎవరికైనా అభ్యంతరములు అయినా ఈ క్రింది నంబర్ కి 8121491823 ఫోన్ చేయవలసిందిగా కోరుచున్నాము ఈ స్థలముకు హద్దులు పడమర: 33 అడుగుల రోడ్డు తూర్పు: వడ్లమూడి జగన్మోహన్ రావు గారి కుమారులు ఇతరులకు విక్రయించిన ఆస్తి దక్షిణం: ఆర్‌ఎల్వీ శిరీష గారి ఆస్తి ఉత్తరం: యానమండ్రా నాగ వెంకట మురళి శంకర్ గారి ఆస్తి కొంతవరకు యానమండ్ర శాంతి గారు వగైరాల ఆస్తి కొంతవరకు..

IN THE COURT OF THE HON□BLE XVI ADDL. DISTRICT JUDGE, KRISHNA AT NANDIGAMA
O.S. No.45 of 2015

Yaddanapudi Koteswara Rao □Plaintiff

And

Mellampudi Pitchaiah (Died) & others □Defendants.

D16 - Tati Dhanalakshmi, W/o. Saidulu, aged about 40 years, R/o. Anasagaram Village, Nandigama Mandal, NTR District

పై నెంబరు O.S. No.45 of 2015 లో ప్రతివాది D 16. తాటి ధనలక్ష్మికి ఎన్నిమార్లు దావా సమన్లు పంపినను ఉద్దేశ్య పూర్వకంగా తీసుకో నందున కోర్టు వారి ఉత్తర్వుల మేరకు పత్రికా ముఖంగా ప్రచురిస్తూ, ది. 12.12.2025 న వాయిదా వున్నది. సదరు ప్రతి వాది వాయిదా తేదీన పై కోర్టు వారి ఎదుట ఉదయం గం.10.30.ని.లకు హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొన గలరు. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించి ఎక్స్ పార్టీ చేయుదరని తెలియజేయ డమైనది.

///శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు//

వాయిదా తేదీ.12-12-25

ఇట్లు
అడపాల నిర్మలబాబు, న్యాయవాది,
నందిగామ, ఎన్టీఆర్ జిల్లా.

మహారాజశ్రీ గౌరవనీయులైన ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్), తిరువూరు వారి కోర్టులో
O.S. No. 350/2024

Between:

యలమంచిలి ఇందిరాదేవి ... వాది

మరియు

చనుమోలు లక్ష్మి అనుపమ, W/o. రాజీవ్
వెలగలేరు గ్రామం, జి.కొండూరు మండలం,
ఎన్టీఆర్ జిల్లా .... ప్రతివాది

పై నెంబరు దావా లో ప్రతివాది కి దావా సమన్లు శ్రీ కోర్ట్ వారు పేపర్ పబ్లికేషన్ ద్వారా ఆర్డర్ వేసియున్నారు. కావున ప్రతివాది అయిన చనుమోలు లక్ష్మి అనుపమ ది.31-12-2025వ తేదీన ఉదయం గం.10-30 నిముషాలకు శ్రీ కోర్టు వారి ముందు ప్రత్యక్షంగాగానీ లేదా న్యాయవాది ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు ఉన్నయెడల తెలుపుకొనగలరు. లేనియెడల మీ పరోక్షముందు తీర్మానించబడునని తెలియపరచ డమైనది.

(కోర్టు ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా: 31.12.2025

ఇట్లు
1. కేతినేని వెంకటేశ్వరరావు
న్యాయవాది, విజయవాడ
2. మొగపర్తి సత్యం,
న్యాయవాది, తిరువూరు
సెల్ నెం: 984914199, 9441584140

మహారాజశ్రీ గౌరవనీయులైన ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్), తిరువూరు వారి కోర్టులో
I.A.No. 662/2024 In O.S. No. 350/2024

Between:

యలమంచిలి ఇందిరాదేవి .... పిటీషనరు/వాది

మరియు

చనుమోలు లక్ష్మి అనుపమ, W/o. రాజీవ్
వెలగలేరు గ్రామం, జి.కొండూరు మండలం,
ఎన్టీఆర్ జిల్లా ... రెస్పాండెంటు/ప్రతివాది

పై నెంబరు దావా IA లో రెస్పాండెంటు కు శ్రీ కోర్టు వారు పేపర్ పబ్లికేషన్ ద్వారా నోటీసు ఆర్డర్ వేసియున్నారు. కావున రెస్పాండెంటు అయిన చనుమోలు లక్ష్మి అనుపమ ది.31-12-2025 వ తేదీన ఉదయం గం.10-30 నిముషాలకు శ్రీ కోర్టు వారి ముందు ప్రత్యక్షంగాగానీ లేదా న్యాయవాది ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు ఉన్నయెడల తెలుపుకొనగలరు. లేనియెడల మీ పరోక్షముందు తీర్మానించబడునని తెలియపరచడమైనది.

(కోర్టు ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా: 31.12.2025

ఇట్లు
1. కేతినేని వెంకటేశ్వరరావు
న్యాయవాది, విజయవాడ
2. మొగపర్తి సత్యం,
న్యాయవాది, తిరువూరు
సెల్ నెం: 984914199, 9441584140

మధ్యాహ్న భోజనం పరిశీలన

ప్రజాశక్తి-అవనిగడ్డ: అవనిగడ్డ జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలలలో మధ్యాహ్న భోజనాన్ని ఆంధ్రప్రదేశ్ ఫుడ్ కమిషన్ సభ్యులు జక్కంపూడి కృష్ణకిరణ్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందరరేగా ఆయన మధ్యాహ్న భోజనం బాగుందని సిహెచ్.భాగ్యలక్ష్మి, సాయి, ప్రధానోపాధ్యాయులు ఎం.నాగమల్లేశ్వరరావు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.పరమేశ్వరరావులను అభినందించారు. ఈకార్యక్రమంలో ఎంఈఓలు ఎన్.శివశంకరరావు, పిచ్చయ్య పాల్గొన్నారు.

టిడిపి నేతలపై కేసు కొట్టివేత

ప్రజాశక్తి-అవనిగడ్డ: వైసిపి పాలనలో 2023లో రేపల్లె పోలీసులు అవనిగడ్డ టిడిపి నాయకులపై పెట్టిన కేసును అవనిగడ్డ సబ్ కోర్టు జడ్జి కేసును కొట్టి వేసినట్లు ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నాగాయలంక మండలం పెదపాలెం గ్రామానికి చెందిన ఎస్సీ కుటుంబానికి చెందిన కుటుంబానికి చెందిన యజమానిని రేపల్లె పోలీసులు తీసుకువెళ్లడంతో, అతని భార్య దిక్కుతోచని స్థితిలో ఆత్మహత్యాయత్నం చేయగా ఆమెను ఆవనగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా ఆ కుటుంబానికి అండగా అవనిగడ్డ టిడిపి నాయకులు ఆందోళన చేయడంతో వారిపై కేసు నమోదు చేశారు. ఈ కేసు పూర్వపరాలు విచారించిన జడ్జి కేసులో నీతులైన కర్ర సుధాకర్, పెదపాలెం సర్పంచ్ దున్న రాజేష్, కొల్లూరి ఇమ్మానుయేలు, తానంకి పోతురాజులతోపాటు 16 మందిపై కేసు నమోదు చేయగా బుధవారం ఆ కేసు కొట్టివేస్తూ జడ్జ్ తీర్పు ఇచ్చినట్లు ఏఎంసీ చైర్మన్ చెప్పారు.

వైసిపి హయాంలో రాష్ట్రం దివాళా : మంత్రి కొల్లు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అన్ని రకాలుగా జగన్ రెడ్డి నాశనం చేశాడని రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. జగన్ రెడ్డి లాంటి ఆర్థిక నేరస్తుడిని ఆర్థిక వేత్తగా వైసీపీ నేతలు బిల్డప్ ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటనలో వైసీపీ నేతల వ్యవహార శైలిని తప్పుబట్టారు. రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి ప్రజల్ని అప్పుల ఊబిలో నెట్టిన దుర్మార్గ పాలన జగన్ రెడ్డిది అన్నారు. రూ.43 వేల కోట్ల ప్రజల సొమ్ము బొక్కేసిన జగన్ రెడ్డిని, 8000 బస్తాల పేదల బియ్యం బొక్కేసిన పేర్ని నాని కీర్తించడం హాస్యాస్పదం. మద్యం కుంభకోణంలో

జగన్ రెడ్డి సహా వైసీపీ నేతల పాత్ర బయటపడుతోందన్నారు. గతంలో ఇసుక అక్రమాలను ప్రశ్నించిన వారిపై, మద్యం అక్రమాలపై నిలదీసిన వారిని నడి రోడ్డుపై చిత్రహింసలు పెట్టారన్నారు. చివరికి మాస్కు అడిగిన పాపానికి దళిత డాక్టర్ సుధాకర్‌ను పిచ్చోడిగా చిత్రీకరించి చంపేశారన్నారు. అమర్నాథ్ గౌడ్ లాంటి అమాయకులను తగులబెట్టేశారన్నారు. అలాంటి పాలన మాకొద్దని ప్రజలంతా ఏకమై కూటమికి ఘన విజయం అందించారాని గుర్తు చేశారు. రాష్ట్ర అభివ ద్ధి, సంక్షేమం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పడుతున్న శ్రమను చూసి ఓర్వలేక వైసీపీ నేతలు విమర్శలు చేస్తున్నారన్నారు.

విద్యార్థులకు కెరీర్ గైడెన్స్

ప్రజాశక్తి-మొవ్వ: యువత విజయాలకు విద్య సరైన మార్గమని విశ్రాంత ఉపాధ్యాయులు పామర్తి వెంకటనారాయణ పేర్కొన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కూచిపూడి శాఖ ఆధ్వర్యంలో బుధవారం మొవ్వ మండలంలోని నిడుమోలు జిల్లా పరిషత్ హై స్కూల్ ప్లస్ (బాలికల జూనియర్ కాలేజ్), కాజ, కోసూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదవ తరగతి విద్యార్థులకు నిర్వహించిన కెరీర్ గైడెన్స్‌లో పలు సూచనలు ఇచ్చి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గత విద్యా సంవత్సరం పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నరసింహఫణీంద్ర, చైర్మన్ పిట్టు శ్రీనివాసరావు, కో చైర్మన్ తాళ్లూరి మోహనకృష్ణ, కార్యదర్శి మాతంగి కిషోర్, ఈసీ ఎడ్యుకేషన్ మేక రాణి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అరుణ, టి.వెంకటరమణి, వి.సమాధానరావు పాల్గొన్నారు.

12న మచిలీపట్నంలో జాబ్‌మేళా

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీ శుక్రవారం మచిలీపట్నంలోని ఎస్ఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ తెలిపారు. జాబ్‌మేళాకు సంబంధించిన గోడ పత్రికను కలెక్టర్ ఛాంబర్‌లో బుధవారం ఆవిష్కరించారు. అభ్యర్థులు ముందుగా https://naipunyam.ap.gov.in/user-registration లింక్ నందు తప్పనిసరిగా రిజిష్టర్ కావాలని, మరిన్ని వివరాలకు 9966489796, 6300618985, 9989519495 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

బాలికలకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-ఉంగుటూరు: దావాజీగూడెంలోని ఎస్సీ హాస్టల్లో 18 మంది, బీసీ హాస్టల్లో 31 మంది బాలికలకు గుడివాడ ఏరియా వైద్యశాల చర్మవ్యాధుల నిపుణులు డాక్టర్ సుగుణావతి బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గన్నవరం సామాజిక ఆరోగ్య కేంద్రం జనరల్ వైద్య నిపుణురాలు షహనాజ్, ఎంపీడీవో స్వర్ణలత, ఈవో ప్రసాద్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: మండలంలో రూ.1.50 కోట్ల ఎన్ఆర్జిఎస్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను గుడివాడ, పెడన ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, కాగిత కృష్ణప్రసాద్ బుధవారం ప్రారంభించారు. ముందుగా మండలంలోని వేమవరం గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మాణం పూర్తి చేసుకున్న రోడ్డును ఎమ్మెల్యేలు ప్రారంభించారు. అనంతరం గుడ్లవల్లేరు గూడూరు మండలాలను కలుపుతూ రూ.1.31 కోట్లతో నిర్మించే వేమవరం-నాగారం బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు,

జనసేన ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్, టిడిపి మండల అధ్యక్షుడు కొసరాజు బాపయ్య చౌదరి, మార్కెట్ యార్డ్ చైర్మన్ పొట్లూరు రవి, సర్పంచ్ మన్యం పద్మావతి పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి : సిపిఎం

ప్రజాశక్తి-గుడివాడ: స్వచ్ఛ భారత్, సుందరీకరణ పేరుతో మున్సిపాలిటీ లక్షలాది రూపాయలు మంచి నీళ్ల ప్రాయంగా ఖర్చు చేయడం సరికాదని సిపిఎం మండల కార్యదర్శి ఆర్.సి.పి.రెడ్డి విమర్శించారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో గుడివాడ పట్టణంలో సెంటర్లో డివైడర్ల మధ్య మొక్కలు పెంచారని, ఇప్పుడు ఆ మొక్కలన్నిటిని తొలగించి మళ్లీ డివైడర్లలో కొత్త మట్టి వేసి తిరిగి కొత్త మొక్కలు పెడుతున్నారని అన్నారు. ప్రజాసమస్యల్ని పట్టించుకోవటం లేదని విమర్శించారు. సుందరీకరణ కంటే ముందు గుడివాడలో నెలకొన్ని సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో రజిని, సురేంద్ర, కొండ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధరకు పంటలను కొనాలి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): ధాన్యం, పత్తి మొక్కజొన్న, అరటి తదితర పంటలకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ప్రకటించి కొనుగోలు చేయాలని, కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ, ఏపీ రైతు సంఘం సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ధర్నా చౌక్‌లో ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ బాలాజీకి వినతిపత్రంఅ ందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాదు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి గుత్తికొండ రామారావు, ముక్కామల ఉమామహేశ్వరరావు, వెలగపూడి ఆజాద్, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ లింగం ఫిలిప్ తదితరులు పాల్గొన్నారు.

22 అర్జీలు స్వీకరణ

ప్రజాశక్తి-నాగాయలంక: నాగాయలంక ఎంపీడీఓ కార్యాలయంలో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ఆధ్వర్యంలో ప్రజా దర్బార్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు.

ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల ప్రజలు తమ వ్యక్తిగత, గ్రామ సమస్యలపై మొత్తం 22 అర్జీలు సమర్పించారు. వాటిని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, నియోజకవర్గ ప్రత్యేక అధికారి పెనుమూడి సాయిబాబు పరిశీలించి సంబంధిత శాఖల అధికారులతో చర్చించి పరిష్కారాలు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కే.ఎం.చంద్రశేఖర్, తహసీల్దార్ సీహెచ్ వీరాంజనేయ ప్రసాద్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి-మొవ్వ: మండల పరిధిలోని భట్లపెనుమర్రులో చలసాని బలరామయ్య స్థాపించిన పింగళి వెంకయ్య రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ నుండి గ్రామ పరిధిలో 16 మంది గర్భిణులు, బాలింతలకు, బాలబాలికలు 84 మందికి పౌష్టికాహారం అందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సిఇఒ డాక్టర్ తలశిల మల్లిఖార్జునవరప్రసాదరావు, సర్పంచ్ మట్టా ఇందిర, ఎంపిపి కొండేటి ఇందిర, పంచాయతీ కార్యదర్శి వి.ప్రభుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతతో సమాజాభివృద్ధికి అవకాశాలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: అంతరిక్ష సాంకేతికతతో సమాజ అభివృద్ధికి అవకాశాలు సమకూరుతున్నట్లు పలువురు

శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. స్థానికశేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీలో ఆంధ్రప్రదేశ్ స్పేస్ టెక్ అకాడమీ, శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీ సంయుక్త ఆధ్వర్యంలో అకాడమీ ఫర్ సైన్స్, టెక్నాలజీ అండ్ కమ్యూనికేషన్ సహభాగత్వంతో అడ్వాన్సు స్పేస్ సైన్స్ అండ్ సొసైటీ అనే అంశంపై బుధవారం సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డాక్టర్ నాగేశ్వరరావు, ప్రఖ్యాత శాస్త్రవేత్త, డాక్టర్ వి.శేషగిరిరావు, పూర్వ డిప్యూటీ డైరెక్టర్ కె.వి.రమణ, కళాశాల డైరెక్టర్ డాక్టర్ పి.సిద్ధయ్య, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

హక్కుల పరిరక్షణకు న్యాయస్థానాలు కృషి

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్: మానవ హక్కుల పరిరక్షణకు న్యాయస్థానాల అండగా ఉంటాయని జిల్లా న్యాయ సేవధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వి.రామకృష్ణయ్య పేర్కొన్నారు. బుధవారం అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం పురస్కరించుకుని మచిలీపట్నం లేడీ యాంప్తిల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జిల్లా న్యాయశాఖ, ఎన్ఎస్ఎస్ యూనిట్ సంయుక్త

ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.లక్ష్మి, ప్రోగ్రాం అధికారి లంకిశెట్టి హరనాధ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం

ప్రజాశక్తి-బంటుమిల్లి: బంటుమిల్లి దుర్గా నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద పూరిల్లు అగ్ని ప్రమాదానికి గురైంది. బంటుమిల్లి కోటేశ్వరరావు బుధవారం కుటుంబ సభ్యులతో కలిసి స్థానిక కనకదుర్గ ఆలయానికి వెళ్లారు. ఆ సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇల్లు దగ్ధమైంది. ఇంట్లో పెళ్లి వేడుకల కోసం ఉంచిన రూ.3.30 లక్షలు, బంగారం ఖాళీ పోయాయి.

కెకెఆర్ గౌతమ్ విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి-గుడివాడ : ఇటీవల గుంటూరులో జరిగిన జాతీయ ఓపెన్ కరాటే పోటీలలో డాక్టర్ కేకేఆర్ గౌతమ్ స్కూల్ విద్యార్థి వ్యక్తిగత కుమిటీ విభాగంలో ప్రతిభ కనబరిచిన ఎం హర్షిత్ చౌదరి బహుమతిని సాధించినట్లు ప్రిన్సిపల్స్ పీ లక్ష్మీప్రసాద్,

సత్యారామ్, జ్యోతి, ప్రశాంతిలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందరరేగా వారు మాట్లాడుతూ ఈ పోటీలలో విజయం సాధించిన హర్షిత్ చౌదరి బహుమతిని సాధించడం గొప్ప విషయమన్నారు.

సిఐటియు పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-మొవ్వ: సిఐటియు అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ మొవ్వ పిహెచ్‌సి ఆవరణలో బుధవారం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మేరుగు దేవామణి, లంకపల్లి విజయలక్ష్మి, సువార్తరాణి, సిఐటియు జిల్లా

వైస్ ప్రెసిడెంట్ ఒడుగు గంగాధరవర ప్రసాద్, మండల కన్వీనర్ కొడాలి శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు శీలం నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి-కోడూరు: ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం రైతుల నుంచి ధాన్యాన్ని సక్రమంగా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు బుధవారం తాసిల్దార్ కార్యాలయంలో వినతిపత్రం



అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆవుల బసవయ్య, రేపల్లె యోగ ప్రకాష్, సింహాద్రి వెంకటేశ్వరరావు, రాజగోపాల్రావు పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలన

ప్రజాశక్తి-నందివాడ: నందివాడ పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ ధీరజ్ వినీల్ బుధవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కె.శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-ఉంగుటూరు: కేసరపల్లిలోని వికెఆర్ కాలేజీలో ప్రథమ సంవత్సరం బిఎస్‌సి చదువుతున్న పేద విద్యార్థిని జాహ్నవికి రొటేరియన్ గొట్టం వెంకట రవిబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రొటేరియన్లు నర్రా సీతారామారావు, గన్నే వెంకట్రావు, గొట్టం వెంకట రవిబాబు, కాలేజీ పూర్వ విద్యార్థులు సీతంరాజు వెంకట సత్య సుబ్రహ్మణ్యం, మండవ వెంకట సూర్యనారాయణ రూ.12 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

ప్రజాశక్తి
www.prajasakti.com
కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లా
గురువారం
11 డిసెంబర్ 2025

కోలాటం ప్రదర్శిస్తున్న విద్యార్థులు

సైన్స్ ప్రదర్శనలతో అబ్బురపరుస్తున్న చిన్నారులు

విజేతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న బాలోత్సవం ప్రతినిధులు

అభిప్రాయాలు

చాలా ఆనందంగా ఉంది. సుష్మా

వరుసగా రెండు సార్లు బాలోత్సవంలో పాల్గొన్నాను. గతం కంటే ఎక్కువ అంశాలలో ఈసారి పోటీలు నిర్వహిస్తున్నారు. చాలా బాగున్నాయి. ఇటువంటి కార్యక్రమాలలో పాల్గొనడం వలన మా ప్రతిభ తెలుస్తుంది. మా స్కూల్ ఉపాధ్యాయులు కూడా ఈ పోటీలలో పాల్గొనడానికి చక్కని ప్రోత్సాహకం ఇచ్చారు.

ప్రతిభ తెలుస్తుంది : భవిష్య

బాలోత్సవ్ సాంస్కృతిక అంశాలలో ఇన్ని పోటీలు ఇక్కడ మాత్రమే జరుగుతున్నాయి. ఒకే చోట ఒకే సారి ఎక్కువ అంశాలలో పోటీలు జరగడం ఇక్కడే మొదటిసారి. నేను రెండు అంశాలలో పాల్గొంటున్నాను. ఈ పోటీలలో పాల్గొనడం వలన మనకు బయట అంశాలు తెలవడంతో పాటు మనం ఏ స్థాయిలో ఉన్నామో కూడా తెలుస్తుంది.

పోటీలు స్ఫూర్తివంతం : మోక్షిత

ఈ పోటీలకు మా తల్లి దండ్రులు కూడా వచ్చారు. చూసి చాలా బాగున్నాయని చెప్పారు. గతంలో చాలా చోట్ల పోటీలకు వెళ్ళాము అక్కడ కొద్ది అంశాలలోనే జరిగేవి. ఇక్కడ అకడమిక్, సాంస్కృతిక అంశాలలో జరుగుతున్నాయి. వీటిని చూడడం వలన మనము మంచి విషయాలను తెలుసుకోవచ్చును.

మొదటిసారి పాల్గొన్నా : నీరజ

బాలోత్సవంలో నేను మొదటిసారి కోలాటంలో పాల్గొన్నాను. అన్ని అంశాలు బాగున్నాయి. వీటి నుండి మనం చాలా నేర్చుకోవాలి. మనకు మంచి సృజనాత్మకత, ఆలోచనాత్మకత పెరుగుతుంది. ఇక నుండి నేను ప్రతి సంవత్సరం పాల్గొంటాను.

బాలల సందడి

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్

కోలాటం, జానపద నత్యాలు, దేశభక్తి గీతలు, తెలుగు పద్యాలు ఇలా విద్యార్థుల సృజనాత్మక ప్రదర్శనలతో విజయవాడ మొగల్రాజపురంలోని సిద్ధార్థ కళాశాల ప్రాంగణం సందడి, కోలాహలం నెలకొంది. అమరావతి బాలోత్సవ్ 8వ పిల్లల పండుగ రెండో రోజు బుధవారం వివిధ అంశాల్లో విద్యార్థులు అద్భుత ప్రదర్శనలు చేసి ఆకట్టుకున్నారు. కల్చరల్ విభాగంలో ప్రధాన వేదికపై కోలాటం, దేశభక్తి గీతాలు, క్లాసికల్ డాన్స్, జానపద గీతాలలో పోటీలు జరిగాయి. సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో జరిగిన పోటీల్లో చిన్నారులు ఒకరికి మించి ఒకరు పోటీలు పడి కళా ప్రదర్శనలు చేశారు. కళాశాల ఇండోర్ స్టేడియంలో చిత్రలేఖనం, తెలుగు డిక్టేషన్ విభాగాలలో పోటీలు జరిగాయి. జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో బెస్ట్ ఫ్రమ్ వేస్ట్ అంశంపై నిర్వహించిన పోటీలలో విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. పనికిరాని వస్తువులతో ఇంటిని అలంకరించుకునేలా తయారు చేసి తమ సృజనాత్మకతను చాటుకున్నారు. చివరగా తెలుగు, ఇంగ్లీషు విభాగాల్లో పద్యాలు చెప్పి ఎందులోనైనా తమకు తామే పోటీ అన్నట్లుగా ప్రతిభను ప్రదర్శించారు.

నిత్యం పుస్తకాలతో... చదువుల ఒత్తిడిలో ఉన్న చిన్నారులకు మానసిక వికాసం కోసం సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో అవసరం అని ఎపిఎంఎస్ఎంఈ ఇండస్ట్రీ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు బాయన వెంకట్రావు అన్నారు. అమరావతి బాలోత్సవం 8వ పిల్లల పండుగ రెండవ రోజు విజేతల బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం బుధవారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో సృజనాత్మక శక్తిని వెలికి తీసేందుకు బాలోత్సవ్ వంటి కార్యక్రమాలు ఉపయోగపడ తాయన్నారు. విజయవాడ నగరంలో గత ఎనిమిది సమర్సరాలుగా బాలోత్సవం నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. బాలోత్సవం వంటి కార్యక్రమాలు అన్ని చోట్లా జరగాలని అప్పుడే విద్యార్థుల్లో వికాసం అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. బాలోత్సవ్ అధ్యక్షులు ఎస్.పి.రామరాజు మాట్లాడుతూ చిన్నారుల్లో సృజనాత్మక పెంపొందించడానికి ప్రతి సంవత్సరం బాలోత్సవం నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో అమరావతి బాలోత్సవం ప్రధాన కార్యదర్శి రామిశెట్టి కొండలరావు, ఎంబివికె కార్యక్రమాల కన్వీనర్ పిన్నమనేని మురళీకృష్ణ, సభ్యులు ఉయ్యూరు సాంబిరెడ్డి, యువి రామరాజు, వైవి సుబ్బారావు పాల్గొన్నారు.

పాటల పోటీల్లో చిన్నారులు

జన విజ్ఞాన వేదిక ప్రదర్శన

రహదారి అభివృద్ధికి నిధులు మంజూరు

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ మండలం తొర్రగుడిపాడు-దాములూరు పంచాయతీరాజ్ రహదారి అభివృద్ధికి రూ.55 లక్షలు మంజూరు చేశారు. కిలో మీటరు పొడవున్న రహదారికి ఎట్టకేలకు నిధులు మంజూరు చేయడంపై సర్పంచ్ చెరుకూరు హైమారావు, కొణతమాత్మకూరు సొసైటీ అధ్యక్షుడు చెరుకూరు సాంబశివరావు జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, ఎంపి కేశినేని శివనాథ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : యుటిఎఫ్ సౌజన్యంతో ఎంఎన్ఆర్ ఫౌండేషన్ ఛైర్మన్ ముప్పిడి నాగేశ్వరరెడ్డి స్థానిక గీతాంజలి హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు బుధవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. విద్యార్థులకు ఈ స్టడీ మెటీరియల్ ఎంతో ఉపయోగపడుతుందని నాగేశ్వరరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల కార్యదర్శి ప్రకాష్, గీతాంజలి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు వసంత, సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి : బొల్లినేని

ప్రజాశక్తి - తిరువూరు : ప్రభుత్వ ఖజానాపై ఏమాత్రం భారం పడని సహకార సంఘాల ఉద్యోగులు దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం మేనమేషాలు లెక్కిస్తోందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ల ఐక్య వేదిక జెఎసి జిల్లా నాయకులు బొల్లినేని రఘురాం తెలిపారు. బుధవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ దృష్టికి ఐక్యవేదిక నాయకులు తీసుకెళ్లినప్పటికీ ఫలితం లేకుండా పోయిందన్నారు. 2019 మార్చి1న ప్రభుత్వం జీవో 36ను విడుదల చేసి హెచ్‌ఆర్ పాలసీని నిర్ణయించి అమలు చేసేందుకు రాష్ట్ర స్థాయిలో ఎస్‌ఎల్‌ఇసి, జిల్లా స్థాయిలో డిఎల్‌ఇసి కమిటీలను ఏర్పాటు చేసిందన్నారు. ఆ కమిటీలు ఇంతవరకు హెచ్‌ఆర్ పాలసీ అమలుకు చర్యలు తీసుకోకపోవడంతో ఎపి వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ (సిఐటియు), ఎపి సహకార సంఘాల ఉద్యోగుల అసోసియేషన్ (ఏఐబిఈఏ) సంయుక్తంగా అనేక నిరసన కార్యక్రమాలు చేస్తూ.. వాటి అమలు కోసం సంబంధిత అధికారులను కోరుతున్నప్పటికీ వారు నిర్లక్ష్య ధోరణితోనే వ్యవహరి స్తున్నారని తెలిపారు. సహకార సంఘాల ఉద్యోగులకు జీతాలు చెల్లించాలని, వేతన సవరణ చేసేంత వరకు మధ్యంతర భృతి ఇవ్వాలని, గ్రాట్యూటీ చెల్లించాలని, ఉద్యోగ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని, రూ.ఐదు లక్షల ప్రమాద బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిస్కారం కోసం ఈ నెల 6 నుండి జనవరి 5వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా దశలవారీగా ఆందోళనకు జెఎసి పిలుపునిచ్చినట్లు చెప్పారు.

ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌కు జాతీయ స్థాయి గుర్తింపు

ప్రజాశక్తి-మైలవరం : మైలవరం మండలం చంద్రాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి తోలుకోడులోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌కు జాతీయ స్థాయి గుర్తింపు లభించినట్లు చంద్రాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని డాక్టర్ ప్రియాంక మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయస్థాయి నుండి నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్స్ టీం ఈ నెల 1న తోలుకుడు ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్లోని 7 మాండటరీ సర్వీస్ ప్యాకేజీను అస్సెస్ చేశారన్నారు. ఆరోగ్య సిబ్బంది తమ విధులను సక్రమంగా నిర్వర్తించటంతో జాతీయ స్థాయి గుర్తింపు వచ్చినట్లు ఆమె తెలిపారు.

కంచల మేజర్ కెనాల్ పరిశీలన

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ డిసి కమిటీ ఛైర్మన్ రాటకొండ చంద్రశేఖర్ కంచల మేజర్ కెనాల్‌ను బుధవారం నందిగామ నుంచి కంచల వరకు పరిశీలించారు. ధ్వంసమైన డ్రాప్‌లు, విపరీతంగా పెరిగిన కంప చెట్లను తొలగించి, కాలువ పూడికతీత పనులను చేపట్టాలని కోరారు. చివరి ఆయకట్టుకు నీరందించేందుకు చాలా ఏళ్ల క్రితం నిర్మించిన డ్రాప్‌లకు మరమ్మతులు చేయాలని కోరారు. అనంతరం కంచల వాగు, పరిసర పంటలను కూడా ఆయన పరిశీలించారు. ఎన్ఎస్పి డిఇ శశుకుమారి, రైతులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూములపై హక్కు కల్పించాలి

ప్రజాశక్తి-మైలవరం : అసైన్డ్ భూములపై అర్హులకు హక్కులు కల్పించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి పివి ఆంజనేయులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసిన అసైన్డ్ భూములపై అర్హులైన పేదలకే హక్కు కల్పించాలని కోరుతూ మంగళవారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో పలువురు భూ లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మైలవరం మండలంలో సర్వే నెంబర్ 321, 310 నుండి 315 వరకు ఉన్న భూములు ఎస్సీలకు సంబంధించినవని, ఆ భూములను బలవంతంగా ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని పొందుగల, సంద్రగూడెం తదితర గ్రామాలలో గతంలో ఫీల్డ్ లేబర్ కో-ఆపరేటివ్ సొసైటీగా ఏర్పడి భూములు సాగు చేస్తున్న వారికి శాశ్వత హక్కు పత్రాలు ఇవ్వాలని, పోరాట నగర్, చంద్రాల తదితర గ్రామాలలో పేదలు సాగు చేస్తున్న రెవిన్యూ ఫారెస్ట్ భూములకు పట్టాలతోపాటు హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జి కొండూరు, రెడ్డిగూడెం మండలాల్లో సాగు చేసుకుంటున్నా సాగుదారులకు హక్కు పత్రాలు ఇవ్వాలన్నారు. పేదలకు సాగు పట్టాలిప్పించేవరకు రైతు సంఘం, కార్మిక సంఘం అండగా ఉంటుందని అన్నారు.

శివాలయం పునరుద్ధరణ పనులపై సమీక్ష

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ శివాలయం పునరుద్ధరణ పనుల పట్ల ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సంతృప్తి వ్యక్తం చేశారు. రూ.1.30 కోట్ల సిజిఎఫ్ నిధులతో పునర్నిర్మాణం, శాండ్ బ్లాస్టింగ్‌తో గర్భాలయ పూర్వ వైభవం పునరుద్ధరణపై ఎమ్మెల్యే సంతృప్తి చెందారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య బుధవారం నందిగామ మెయిన్ సెంటర్‌లోని చారిత్రక శ్రీ శుకశ్యామలాంబ సమేత రామలింగేశ్వర దేవస్థానంను సందర్శించి, పునర్నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించారు. రూ. 1 కోటి 30 లక్షల సిజిఎఫ్ నిధులతో చేపట్టిన ఈ పనులలో ఉపాలయాలు, ముఖ మండపం, ప్రధాన ఆలయం పునర్నిర్మాణం జరుగుతోందని తెలిపారు. ఆలయ చైర్మన్ తన సొంత నిధులతో నిర్మిస్తున్న ప్రహరీ ప్రాకారం పనులు, ఒక దాత ఇచ్చిన స్థలంలో నూతనంగా నిర్మిస్తున్న ఆఫీసు భవన నిర్మాణాలను ఎమ్మెల్యే పరిశీలించారు. పనుల నాణ్యతలో రాజీ పడకుండా వీలైనంత వేగంగా పనులను పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

మానవ హక్కులను గౌరవించాలి

ప్రజాశక్తి - గంపలగూడెం : మానవ హక్కులను గౌరవిస్తూ లింగం, మతం, జాతి వంటి విభేదాలు లేకుండా ప్రతి ఒక్కరు నడుచుకోవాలని తిరువూరు జూనియర్ అడిషనల్ సివిల్ కోర్టు జడ్జి కె.సూర్య తేజ అన్నారు. మండల న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో గంపలగూడెం మండలం తోటమూలలోని విశిష్ట జూనియర్ అండ్ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన మానవ హక్కుల అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. కుల, మత భేదాలు లేకుండా విద్యార్థులు స్నేహ పూర్వకంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీపీ బడేమియా, బార్ కౌన్సిల్ అధ్యక్షుడు చింతల వెంకటరెడ్డి, ఎస్సై అనిల్, సీనియర్ న్యాయవాదులు సంకురాత్రి జనార్ధనరావు, రాజవరపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కొండపల్లి బొమ్మల కళాకారులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ పసుపులేటి హరిప్రసాద్ మైలవరం జనసేన ఇంచార్జి అక్కల గాంధీ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కొండపల్లి బొమ్మల ప్రాముఖ్యత, కళాకారుల నైపుణ్యత, కళాకారులు పడుతున్న ఇబ్బందులు, బొమ్మలకు కావాల్సిన కలప గురించి, కళాకారులకు రావాల్సిన ప్రోత్సాహకాలు.. అవార్డుల గురించి చర్చించి వారిని కొండపల్లికి రావాలని ఆహ్వానించారు. దీనిపై హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ స్పందిస్తూ త్వరలోనే కొండపల్లి బొమ్మల కళాకారులతో ఒక సభ ఏర్పాటు చేసి వారితో ముఖాముఖీ కార్యక్రమం చేపడతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొండపల్లి మున్సిపాలిటీ అధ్యక్షులు చెరుకుమల్లి సురేష్, కో ఆప్షన్ సభ్యులు యర్రంశెట్టి నాని, రమేష్, మహేష్ పాల్గొన్నారు.

ఉత్సవాలకు ఆహ్వానం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని శ్రీ వరదరాజ స్వామి వారి దేవస్థానంలో జరగబోయే ధనుర్మాస ఉత్సవాల ఆహ్వాన పత్రికను కమిటీ సభ్యులు శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)ని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ నూకల కుమార్ రాజా, సంకా వెంకట్రావు, వరదరాజ స్వామి వారి దేవస్థానం ఛైర్మన్ భారత లక్ష్మీ, పద్మావతి, కార్యనిర్వహణాధికారి జయప్రకాష్ బాబు పాలకవర్గ సభ్యులు ఏనుగుల సీతారావమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు చీరలు పంపిణీ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని షేర్ మొహమ్మద్ పేట గ్రామంలో మంగళవారం రాత్రి సెమీ క్రిష్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎస్ఐ చర్చి డిసి గంట ఆనందరావు ముఖ్య అతిథిగా విచ్చేసి క్రిస్మస్ సందేశాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా సెమీ క్రిస్టమస్ కేక్‌ను కట్ చేసి మిఠాయిలు పంచారు. అనంతరం స్థానిక సంఘ కాపరి పి.విజయలక్ష్మి 36 మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పి.కనకరాజు, పి ఇమ్మానుయేలు, డి వినోద్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

సిఐటియు మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-వత్సవాయి

సిఐటియు మహాసభ పోస్టర్‌ను బుధవారం వత్సవాయి మండల కేంద్రంలోని బిల్డింగ్ కార్మికుల అడ్డా వద్ద పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ.కమల మాట్లాడుతూ ఈ మహాసభలో దేశంలో అన్ని రాష్ట్రాల నుండి కార్మికుల సమస్యలపైనా, వారి హక్కులకు నష్టం చేకూర్చే లేబర్ కోడ్‌లు రద్దు, తదితర విషయాలపై చర్చించి భవిష్యత్ కర్తవ్యాలు రూపొందిస్తారని తెలిపారు. జనవరి 4న విశాఖపట్నం ఆర్కే బీచ్ వద్ద బహిరంగ సభ జరుగుతుందని, ఈ సభకు బిల్డింగ్ కార్మికులు పెద్ద ఎత్తున, తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు చిరుమామిళ్ళ హనుమంతరావు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎస్.కె జానీ , వెంకటరామయ్య, గురవయ్య ముజఫర్, వెంకటరమణ,శ్రీను తదితరులు పాల్గొన్నారు

పాడి రైతులకు చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - తిరువూరు : పాడి రైతులను ఆదుకునేందుకు కృష్ణా మిల్క్ యూనియన్ అంకితభావంతో పనిచేస్తోందని యూనియన్ జిల్లా పాలక వర్గ సభ్యులు బొట్టు రామచంద్రరావు అన్నారు. తిరువూరు కస్టర్ పరిధిలోని లక్ష్మీపురం పాలసీతల కేంద్రంలో బుధవారం 2025-2026 సంవత్సరానికి రెండో విడత ఆగస్టు నుంచి నవంబర్ వరకు 10 శాతం ధర వ్యత్యాసం 184 గ్రామాలకుగాను రూ.1,43,64,441.50 చెక్కులను పాల ఉత్పత్తి కేంద్రాల రైతులకు జిల్లా ట్రస్ట్ సభ్యులు పల్నాటి సత్యనారాయణ, ఫీడ్ కమిటీ సభ్యులు సూరయ్య, మేనేజర్ దిలీప్ కుమార్ తో కలిసి అందజేశారు. ప్రభుత్వ పథకంలో భాగంగా సరఫరా చేసే సెక్స్ సార్టెడ్ సెమెన్ డోస్‌కు ధర రూ.150 ఉండగా ఉమ్మడి కృష్ణా జిల్లాలో పాడి రైతులకు కేవలం రూ.50కు మాత్రమే కృష్ణా మిల్క్ యూనియన్ అందజేస్తుందని తెలిపారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

ప్రజాశక్తి జగ్గయ్యపేట: ప్రభుత్వం నిర్దేశించిన ప్రభుత్వ పాఠశాలలో ప్రతిరోజు మెనూ ప్రకారంగా విద్యార్థులకు భోజనాలు పెట్టాలని మండల విద్యాశాఖ అధికారి ఎల్ చిట్టిబాబు అన్నారు. పట్టణంలోని 13వ వార్డు పాఠశాలను బుధవారం మండల విద్యాశాఖ అధికారి చిట్టిబాబు సందర్శించి మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ వంద రోజులు ప్రత్యేక ప్రణాళికలు తయారు చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు.

బాధితులకు అండగా ఉంటాం : వైసిపి

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : విజయవాడ భవానీపురం జోజినగర్ 42 ఫ్లాట్స్ బాధితులను బుధవారం వైసిపి కార్పొరేటర్ల బృందం పరామర్శించింది. ఈ క్రమంలో కోర్టు ఉత్తర్వులతో కూల్చిన ఇళ్లను నేతలు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వైసీపీ ఫ్లోర్ లీడర్ వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ.. ఈ 42 ఫ్లాట్ల బాధితుల గురించి కౌన్సిల్లో చర్చించినట్లు తెలిపారు. బాధితులకు న్యాయం చేసే వరకు వైసిపి తరుపున పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి డిప్యూటీ మేయర్లు శైలజా రెడ్డి, దుర్గ, కార్పొరేటర్లు బండి పుణ్యశీల, యారడ్ల ఆంజనేయరెడ్డి, బాపతి కోటిరెడ్డి, షేక్ రహ్మాతున్నిసా, ఎండీ ఇర్ఫాన్, గోదావరి గంగా, మల్లేశ్వరి, చైతన్య రెడ్డి పాల్గొన్నారు.

విజిలెన్స్ అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి-ఉయ్యూరు: గ్రామాల్లో విద్యుత్ విజిలెన్స్ అధికారులు బుధవారం గృహాలు, వాణిజ్య సముదాయాలపై తనిఖీలు నిర్వహించి రూ.9.44 లక్షలు జరిమానా విధించారు. విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విహెచ్ వాసు, ఉయ్యూరు ఈఈ బీవీ సుధాకర్ ఆధ్వర్యంలో అధికారులు 32 బ ందాలుగా ఏర్పడి 2,615 నివాస గృహాలు, 108 వాణిజ్య సముదాయాలు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉయ్యూరు డీఈఈ హేమకుమార్, రూరల్ ఏఈ కె.నాగేశ్వరరావు, సిబ్బంది పా ల్గొన్నారు.

విద్యార్థుల ర్యాలీ

ప్రజాశక్తి-కంకిపాడు: మద్దూరులో ధనేకుల టెక్నాలజీ ఇంజనీరింగ్ కాలేజీ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ క్యాంప్‌ను విద్యార్థులు నిర్వహించారు. సర్పంచ్ చిప్పల రాందాస్ పాల్గొని ర్యాలీని ప్రారంభించారు. ఇషా ఫౌండేషన్ కో ఆర్డినేటర్ పూజిత కాలుష్యం నియంత్రణ గురించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో క్యాంప్ ప్రోగ్రాం ఆఫీసర్ టి వెంకటేశ్వరరావు, కో ఆర్డినేటర్ కృష్ణసాయి, నాగేంద్ర పాల్గొన్నారు.

సిపిఆర్‌పై శిక్షణ

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్: అత్యవసర సమయంలో ప్రథమ చికిత్స చేసే విధంగా విద్యార్థులు సిద్ధం కావాలని విసి కె.రాంజీ అభిలషించారు. బుధవారం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యములో ఇండియన్ మెడికల్ అసోసియేషన్, సత్యసాయి సేవా సమితి సౌజన్యంతో హృదయ శ్వాసకోశ పునరుజ్జీవనంపై శిక్షణా కార్యక్రమం, వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో మచిలీపట్నం యూనిట్ ఐఎంఎ అధ్యక్షులు డా కె. శివప్రసాద్, సత్యసాయి సేవా సమితి అధ్యక్షులు ఆంజనేయకుమార్, డాక్టర్ శ్రావణి పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-అవనిగడ్డ: నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన 44 మందికి ముఖ్యమంత్రి సహాయని ద్వారా వైద్య ఖర్చులకు మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అందజేశారు. సీఎంఆర్ఎఫ్ సహాయం కోసం పేదల సమర్పించే దరఖాస్తులను సాధ్యమైనంత వేగంగా పరిష్కరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు లబ్ధిదారుల తరపున ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ ధన్యవాదాలు తెలిపారు.

ప్లాస్టిక్ నిర్మూలన, మొక్కల పెంపకంపై ర్యాలీ

ప్రజాశక్తి-ఘంటసాల: స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా స్థానిక స్వచ్ఛ ఘంటసాల కార్యాలయం ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, గ్రామస్తులు కలిసి ప్లాస్టిక్ నిర్మూలన, మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. జాతీయ సేవా పథకంలో భాగంగా గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, యు.వి.ఆర్ గొర్రెపాటి స్కూల్, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల మరియు గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణల్లో అధికారులు, విద్యార్థులు, గ్రామస్తులు కలిసి మొక్కలు నాటారు. అనంతరం ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలు, పర్యావరణ పరిరక్షణలో మొక్కల ప్రాముఖ్యతను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ జి. వెంకట రామకృష్ణ, వి.ప్రసాద్‌రావు, జి.సురేష్, పంచాయతీ కార్యదర్శి జయలక్ష్మి, వైద్యాధికారులు డాక్టర్ సి.సంధ్యారాణి, డాక్టర్ ఎం.ఉషారాణి, డాక్టర్ సువర్ణలత పాల్గొన్నారు.

అపరాలు, పత్తి కొనుగోలు చేయాలని వినతి

ప్రజాశక్తి-కంచికచర్ల : నందిగామ నియోజకవర్గంలో రైతులు పండించిన పెసలు, మినుములు, మొక్కజొన్న పంటతో పాటు పత్తి పంటను ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కంచికచర్ల మార్కెట్ యార్డ్ ఛైర్మన్ కోగంటి బాబు,.. వ్యవసాయ శాఖ మంత్రి కె అచ్చన్నాయుడుకు విజ్ఞప్తి చేశారు. బుధవారం వ్యవసాయ శాఖ కలిసి రైతులు సమస్యలను వివరించారు. తకణమే కంచికచర్ల మార్కెట్ యార్డ్‌లో మార్క్ ఫెడ్ ద్వారా పెసలు, మినుములు, మొక్కజొన్న పంటను మద్దతు ధరకు కొనుగోలు చేయాలని, నందిగామ, కంచికచర్ల మార్కెట్ యార్డ్‌లో సిసిఐ ద్వారా పత్తి కొనుగోలు జరిపి రైతులను ఆదుకోవాలని వినతిపత్రం అందజేశారు. దీనికి స్పందించిన మంత్రి అపరాలు, పత్తి

పంటలు కొనుగోలుకు చర్యలు తీసుకొని రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు కోగంటి తెలిపారు.

ఆర్ఎంపిలు నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): జిల్లాలో ఆర్ఎంపిలు నిబంధనలు ప్రకారం ప్రథమ చికిత్స కేంద్రాలు నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.యుగంధర్ ఆదేశించారు.బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ సమావేశ హాలులో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జిల్లాలోని ఆర్ఎంపిలకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ ఆర్ఎం పిలు నిర్వహిస్తున్న ప్రథమ చికిత్స కేంద్రంలో కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని ఎటువంటి ఇంజక్షన్లు చేయరాదని, అలాగే ఐవి ఫ్లూయిడ్స్ ఎక్కించరాదన్నారు. అలాగే రోగులను చేర్చుకొని ఎటువంటి చికిత్స చేయరాదని ఎటువంటి మందులను ప్రిస్క్రైబ్ చేయరాదని హెచ్చరించారు.

నైపుణ్యం ఉంటేనే ఉపాధి

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్: నేటి పోటీప్రపంచం లో ఇంజనీరింగ్ విద్యార్థులు నైపుణ్యం పెంచుకోవాల్సిన అవసరం ఉందని కృష్ణా విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య కె రాంజీ ఉద్బోధించారు. కెయూ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు నిర్వహిస్తున్న

నైపుణ్య శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. త్వరలో విశ్వవిద్యాలయ ప్రాంగణంలో నిర్వహించబోయే ప్రాంగణ ఎంపికలలో మంచి ప్యాకేజీ తో ఉద్యోగం సాధించాలన్నారు. మనస్సును తమ అధీనం లో ఉంచుకున్న విద్యార్థులే ఉత్తమ ఫలితాలు సాధిస్తారన్నారు. ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ కుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మచిలీపట్నం శాఖ అధ్యక్షులు శంకర్నాథ్, డాక్టర్ బాలాజీ, ఆంజనేయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు

ప్రజాశక్తి-వీరులపాడు : మండల పరిధిలోని తోటమూల నుంచి నరసింహారావు పాలెం వరకు రోడ్డు నిర్మాణానికి పంచాయతీరాజ్ శాఖ నుండి రూ.1.15 కోట్లు మంజూరయ్యాయని గ్రామ సర్పంచి బొమ్మిశెట్టి దుర్గాదేవి తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో నిధుల మంజూరుకు సంబంధించిన జీవో విడుదల కావడంతో నియోజకవర్గ అభివృద్ధికి అడుగు పడిందన్నారు. సమావేశంలో కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బొమ్మిశెట్టి భాస్కర్ రావు మాట్లాడుతూ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయడమే కాకుండా నియోజకవర్గంలో పలు రోడ్లు నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం అభినందనీయమన్నారు.

16 నుంచి ఉర్దూ అకాడమీ వారోత్సవాలు

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : దేశ చరిత్రలోనే ఉర్దూ భాషాభివృద్ధి కోసం పాటు పడిన నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని రాష్ట్ర మైనారిటీ శాఖా మంత్రి ఫరూఖ్ తెలిపారు. బుధవారం విజయవాడ పంజా సెంటర్ జాహుర్ ముషాఫిర్ ఖానాలో ఉర్దూ అకాడమీ ఉద్యోగుల సమీక్షా సమావేశంలో మంత్రి ముఖ్య అతిధిగా పాల్గొని ప్రశాంగించారు. సమావేశానికి ఉర్దూ అకాడమీ చైర్మన్ మొహమ్మద్ ఫరూక్ షుబ్లీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భాషకు మతంతో సంబంధం లేదన్నారు. చైర్మన్ ఫరూక్ షుబ్లీ మాట్లాడుతూ ఉర్దూ భాష, సంస్కృతి భారతదేశ వారసత్వమని తెలిపారు. ఈ నెల 16 నుండి 20వ తేదీ వరకు సురూర్ ఎ ఉర్దూ మహోత్సవ్ పేరుతో ఉర్దూ అకాడమి ఉత్సవాలు నిర్వహిస్తామని అన్నారు. ఈ సమావేశంలో మైనార్టీ ప్రిన్సిపల్ సెక్రటరీ సిహెచ్ శ్రీధర్, ఉర్దూ అకాడమీ సెక్రటరీ గౌస్ పీర్, ఏపిఎస్ఎంఫ్‌సీ ఎండి యాకూబ్ భాష, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ వర్కర్లకు 5 జి మొబైల్ ఫోన్లు మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

ప్రజాశక్తి-విజయవాడ : గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు మరింత వేగంగా సేవల్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ వర్కర్లకు 5 జి మొబైల్ ఫోన్లను అందిస్తున్నామని

మహిళాభివద్ధి శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో బుధవారం అంగన్వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న 58,204 మంది అంగన్వాడీ కార్యకర్తలు, సూపర్వైజర్లు, బ్లాక్ కోఆర్డినేటర్లకు 5 జి స్మార్ట్ ఫోన్లను అందించే కార్యక్రమాన్ని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీ వర్కర్లకు రూ.75 కోట్ల వ్యయంతో మొబైల్ ఫోన్లను పంపిణీ చేశామన్నారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా 55,204 అంగన్వాడీ కేంద్రాల్లో దాదాపు లక్షా 25 వేల మంది సేవలు అందిస్తున్నారని తెలిపారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమం కార్యదర్శి ఏ.సూర్య కుమారి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అంగన్వాడీలకు వచ్చే వారి శాతం 70 శాతం ఉండగా, రాష్ట్రంలో 96 శాతంగా ఉండటం అంగన్వాడీల పనితనానికి నిదర్శనమన్నారు. అనంతరం బాల్య వివాహరహిత ఏపీ పోస్టర్ ను ఆవిష్కరించారు.కార్యక్రమంలో మహిళాభివద్ధి, శిశు సంక్షేమం శాఖ సంచాలకులు ఎం. వేణుగోపాల్ రెడ్డి, జాయింట్ డైరెక్టర్ కే. ప్రవీణా, జిల్లా ఇన్ ఛార్జీ కలెక్టర్ ఎస్. ఇలక్కియా, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ షేక్ రుక్సానా సుల్తానా భేగం, పాల్గొన్నారు.

ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య ఆధ్వర్యంలో బాలచైతన్య స్ఫూర్తి ఆటల పోటీలను బుధవారం పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాలలో నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురామ్, శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ ముఖ్య అతిథులుగా పాల్గొని బహుమతులు అందజేశారు. క్రీడలు వ్యక్తిత్వ వికాసానికి పునాదని, ఆటల ద్వారా పిల్లల్లో నాయకత్వ గుణాలు పెరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేక వెంకటేశ్వర్లు, దూళిపాళ్ల లక్ష్మణరావు, సంకా వెంకట్రావు, గట్టిడి దుర్గాప్రసాద్, గింజుపల్లి వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-ఉయ్యూరు: ఏపీఎన్‌జిఒ ఉయ్యూరు తాలుకా యూనిట్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన ఎన్నికల ప్రక్రియలో బి.వెంకటేశ్వరరావు ప్యానల్ మాత్రమే నామినేషన్ వేయగా ప్యానల్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి కె.పాపారావు, అసిస్టెంట్ ఎన్నికల అధికారి రాజేంద్ర ప్రకటించారు. అధ్యక్షుడుగా బి.వెంకటేశ్వరరావు, అసోసియేట్ అధ్యక్షుడుగా వై.శ్రీకృష్ణ, ఉపాధ్యక్షులుగా బివివీఆర్ నాగేంద్రం, వి.రామానందు, కె.శ్రీనివాసరావు, సెక్రటరీగా ఎం.శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీలుగా సీహెచ్ శ్రీనివాసరావు, కె.బుజ్జిబాబు, కె.కృష్ణమోహన్రావు, మహిళా జాయింట్ సెక్రటరీగా వీవీ హిమజ, ట్రెజరర్గా మల్లేశ్వరస్వామి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు ఏ.శ్రీనివాస్, కార్యదర్శి ఏ. వెంకటేశ్వరరావు, విజయవాడ సిటీ అధ్యక్షుడు సీవీఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ నిరసన

ప్రజాశక్తి-ఉయ్యూరు: సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులు రెండు సంవత్సరాలలోపు టెట్ పరీక్ష ఉత్తీర్ణులవ్వాలని లేకపోతే సర్వీస్నుండి తొలగిస్తామని సుప్రీం కోర్టు తీర్పుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పిటీషన్లు వేయాలని

కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం ఉయ్యూరులో నిరసన ర్యాలీ నిర్వహించి తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పీవీ రమణ, రాష్ట్ర కార్యదర్శి ఎస్పీ మనోహర్‌కుమార్, కె.శ్రీనివాసరావు, కేపి విశ్వమోహన్, నరేంద్ర, రాంబాబు తదితరులు పాల్గొన్నారు. గుడివాడ: ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ మినహాయింపు ఇవ్వాలని కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కేఏ ఉమామహేశ్వరావు, జిల్లా అధ్యక్షులుషౌకత్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శి బి కనకారావు, నీలం ప్రభాకర్, దుర్గాప్రసాద్, చలసాని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు : సిఐ

ప్రజాశక్తి-గుడివాడ : హోటల్స్, లాడ్జిల యాజమాన్యం నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని టూటౌన్ సిఐ జెఆర్‌కె హనీష్ హెచ్చరించారు. గుడివాడ టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న యజమానులు, మేనేజర్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్వాహకులు తప్పనిసరిగా పాటించవలసిన నియమాలు, నిబంధనలు, భద్రతా చర్యలను తెలియజేశారు. సమావేశంలో ప్రతి లాడ్జికి నోటీసులు కూడా అందజేయబడగా, అక్రమ కార్యకలాపాలకు పాల్పడకుండా స్పష్టంగా హెచ్చరికలు ఇచ్చారు. ఈ సమావేశంలో ఎస్సై లోవరాజు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మించాలి

ప్రజాశక్తి-చల్లపల్లి

చల్లపల్లి మండలం వెలివోలులో కెఈబి కెనాల్‌పై నిర్మించిన వంతెనకు అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని బీసీ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బొల్లా ఫణి బాబు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక నేతలతో కలిసి గ్రామంలో పర్యటించారు. కేఈబీ కెనాల్ అప్రోచ్ రోడ్డును పరిశీలించారు. చిన్నపాటి వర్షానికి గోతులు పడి రహదారి చిన్న భిన్నం కావటంతో ప్రమాదాలకు నిలయంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు అప్రోచ్ నిర్మాణం చేపట్టి రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మురాల వెంకటేశ్వరరావు, వేకనూరు బాబురావు, గరికే అంజి, బొల్లా సహదేవుడు, బొల్లా పెద్ద ఫకీరు, బొల్లా నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు

కాలుష్యం వెదజల్లే పరిశ్రమలను తరిమికొట్టాలి

- సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి.కృష్ణ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: అధిక కాలుష్యం వెదజల్లే పరిశ్రమలను తరిమికొట్టాలని సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి.కృష్ణ అన్నారు. పట్టణంలోని విష్ణు ప్రియా నగర్, శాంతినగర్‌లలో సిపిఎం బృంధం బుధవారం పర్యటించింది. ఆయా ప్రాంతాల్లో కాలుష్యం వలన కలుగుతున్న ఇబ్బందుల గురించి స్థానిక ప్రజలను పార్టీ నేతలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డివి కృష్ణ మాట్లాడుతూ ఆటోనగర్‌లో గల ఈ ఫార్మా కంపెనీల వలన జగ్గయ్యపేట పట్టణంలోని విష్ణు ప్రియ నగర్, శాంతినగర్, డివిఆర్ నగర్, టీచర్స్ కాలనీ, షేర్ మహమ్మద్ పేట, సాయి నగర్ ప్రాంతాల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఈ ప్రాంతాల్లో భూగర్భ జలాలు కలుషితమై కనీసం వాడుకోవడానికి సైతం పనికిరాకుండా ఉన్నాయన్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో ప్రజలు వాటర్ ట్యాంకుల ద్వారా సరఫరా చేసే నీటిని వాడుకోవాల్సిన పరిస్థితి తలెత్తిందన్నారు. వాయు కాలుష్యంతో ఈ ప్రాంత ప్రజలు శ్వాసకోశ, చర్మ, కిడ్నీ, క్యాన్సర్ వంటి వ్యాధుల భారిన పడుతున్నారని తెలిపారు. ఈ ప్రాంతంలో డయాలసిస్ సెంటర్‌ను సైతం ప్రారంభించడం ఇందుకు తార్కాణమని అన్నారు. అధిక కాలుష్యంతో హైదరాబాదులో తరిమి కొట్టిన ఫార్మా కంపెనీలు జగ్గయ్యపేట సమీపంలోని ఆటోనగర్‌లో స్థాపించడం వలన ఈ ప్రాంతంలో ప్రజలు ఇబ్బందులు గురవుతున్నారని, ఈ పరిశ్రమలను తొలగించాలని గత కొంతకాలంగా సిపిఎం ఆధ్వర్యంలో పోరాటాలు చేసినట్లు తెలిపారు. పరిశ్రమలు విడుదల చేసే కాలుష్యంతో ఇబ్బందులకు గురవుతున్న ప్రజలు రోడ్డుపైకి వచ్చారని, దీంతో విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ సంఘటనా స్థలం వద్దకు వచ్చి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు. పరిశ్రమలను తొలగించే వరకు ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ పర్యటనలో సిపిఎం జగ్గయ్యపేట మండల, పట్టణ కార్యదర్శి ఎస్.నాగమణి, నాయకులు కె శ్రీనివాసరావు, దాసరి నాగేశ్వరరావు, వివి రాంప్రసాద్, రావిళ్ళ శేషు, తంతాల రాజేశ్వరి, దంతాల నరేంద్ర, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

'పిఎస్‌సిఎంఆర్'లో జాతీయ స్థాయి హ్యాకథాన్

ప్రజాశక్తి - విజయవాడ సిటీ

విజయవాడలోని పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో ఈ 11, 12 తేదీల్లో మైండ్ స్ప్రింట్ 2కె25 పేరుతో 36 గంటల జాతీయ స్థాయి హ్యాకథాన్ నిర్వహించనున్నారు. ఈ హ్యాకథాన్ ద్వారా విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాలు, సృజనాత్మకత, ఆవిష్కరణాత్మక ఆలోచనలు, జట్టు సహకారం, సమస్య పరిష్కార సామర్థ్యం పెంపొందించడమే లక్ష్యం. ఈ లక్ష్యాలకు పిఎస్‌సిఎంఆర్ కాలేజీ నిర్వహిస్తున్న ఈ హ్యాకథాన్ పూర్తి మద్దతు ఇస్తోంది. ఈ సందర్భంగా సైసీమర్ పిఎస్‌పిఎంఆర్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.సరవణ కుమార్, సెక్రటరీ అండ్ కారస్పాండెంట్ డాక్టర్ సి.ఎ. చిత్త అమర్ సుధీర్ మాట్లాడుతూ ఇటువంటి జాతీయ స్థాయి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచడంలో, సాంకేతిక జ్ఞానాన్ని మెరుగుపరచడంలో, భవిష్యత్ ఉద్యోగాలకు సిద్ధం చేయడంలో ఎంతో సహాయపడతాయని తెలిపారు.

కృష్ణా తరంగ్ ఛాంప్ పిబి సిద్ధార్థ

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : కృష్ణా విశ్వవిద్యాలయం నిర్వహించిన కృష్ణా తరంగ్ 2025 అంతర కళాశాలల పోటీల్లో వరసగా 7వ సారి ఓవరాల్ చాంపియన్‌గా విజయవాడ పి.బి. సిద్ధార్థ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ విజయకేతనం ఎగరవేసిన నేపథ్యంలో బుధవారం కళాశాలలో అభినందన సభ జరిగింది. ఈ ప్రత్యేక సమావేశానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేశ్ మాట్లాడుతూ విద్యాబోధనతోపాటు తమ కళాశాల కల్చరల్ కమిటీ, లిటరరీ కమిటీ తదితర విభాగాలతో విద్యార్థులకు సాంస్కృతిక రంగంలో, కళా రంగంలో ప్రత్యేక శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. డైరెక్టర్ వేమూరి బాబూరావు మాట్లాడుతూ మచిలీపట్నంలో మూడు రోజులపాటు కృష్ణా యూనివర్శిటీలో 4 విభాగాల్లో 28 అంశాల్లో పోటీలు నిర్వహించగా పి.బి.సిద్ధార్థ విద్యార్థులు 16 అంశాల్లో విన్నర్లుగా, 5 అంశాల్లో రన్నర్లుగా, 2 అంశాల్లో మూడో స్థానంలో నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో కల్చరల్ కమిటీ కన్వీనర్ డా.బి.జయ ప్రకాశ్, కో ఆర్డినేటర్ ఎం.శివరంజని, పిటిఎస్.ఆర్‌కె.ప్రసాదరావు, పాల్గొన్నారు.

జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు 'ఎల్‌హెచ్‌ఆర్' విద్యార్థులు

ప్రజాశక్తి-మైలవరం : కృష్ణా యూనివర్సిటీ పరిధిలోని కళాశాలల వాలీబాల్ పోటీలలో స్థానిక లకిరెడ్డి హనిమి రెడ్డి కళాశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభను చాటి దక్షిణ భారత విశ్వవిద్యాలయ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి.రంగారావు, ఫిజికల్ డైరెక్టర్ మేజర్ మన్నే స్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత వారం విజయవాడ సిద్ధార్థ మహిళా కళాశాలలో నిర్వహించిన మహిళా పోటీలలో ఎల్‌హెచ్‌ఆర్ కళాశాలలో ఫైనల్ బీఎస్సీ చదువుతున్న సీత, విజయవాడలోని శాతవాహన డిగ్రీ కళాశాలలో నిర్వహించిన పురుషుల వాలీబాల్ పోటీలలో ఫస్ట్ బిఎ చదువుతున్న హ్యాపీ, సెకండ్ బికాం చదువుతున్న జాన్ వెస్లీలు ఎంపిక అయ్యారన్నారు .ఈ ముగ్గురు క్రీడాకారులు ఈనెల 10నుంచి కాకినాడ జెఎన్‌టియు విశ్వవిద్యాలయంలో నిర్వహించే జాతీయ వాలీబాల్ పోటీలకు పురుషుల విభాగంలో హ్యాపీ, జాన్ వెస్లీ ఎంపిక కాగా, ఈ నెల 15 నుంచి చెన్నైలోని ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలో నిర్వహించే దక్షిణ భారత అంతర విశ్వవిద్యాలయ పోటీలకు మహిళా విభాగం నుండి సీత ఎంపిక కావడం జరిగిందని వర్సిటీ అధికారులు తెలిపారు.

టెలికాం అడ్వయిజరీ కమిటీ సభ్యునిగా చంద్రశేఖర్ రెడ్డి



ప్రజాశక్తి - విజయవాడ సిటీ : ఇటీవల వైసిపి టెలికాం అడ్వయిజరి కమిటీ సభ్యుడుగా నియమితులైన తనబుద్ధి చంద్రశేఖర్ రెడ్డి.. మాజీ మంత్రి, వైసిపి పశ్చిమ ఇంచార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావుని బుధ వారం మర్యాద పూర్వకంగా కలిసారు. స్థానిక బ్రాహ్మణ వీధిలోని పశ్చిమ వైసిపి కార్యాలయంలో వెలంపల్లిని కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వెలంపల్లి.. చంద్రశేఖర్ రెడ్డిని సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

ఆల్ న్యూ సెల్టోస్‌ను ఆవిష్కరించిన కియా

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : పెద్ద కొలతలు, మెరుగైన భద్రత, అత్యాధునిక ఆవిష్కరణలతో ఎస్‌యువి నాయకత్వాన్ని పునర్నిర్వచించే అద్భుతమైన ఉత్పత్తిని అందించాలనే దాని నిబద్ధతను కొనసాగించడం కియా ఇండియా బుధవారం ఆల్-న్యూ కియా సెల్టోస్‌ను ప్రీమియర్ చేసింది. భారతదేశం అత్యంత ఇష్టపడే ఎస్‌యువిలలో ఒకటి, ఇది బోల్డ్ కొత్త స్టైలింగ్, ప్రీమియం ఇంటీరియర్స్, విభిన్నమైన కస్టమర్ అవసరాలకు అనుగుణంగా బహుముఖ ట్రిమ్‌లు, పవర్‌ట్రెయిన్‌లను కలిగి ఉంది. డిసెంబర్ 11వ తేదీ అర్ధరాత్రి నుండి దేశవ్యాప్తంగా బుకింగ్‌లు తెరవబడతాయి, దీని ద్వారా కస్టమర్‌లు తమ ఇష్టపడే ఇష్టమైన ఎస్‌యువిని రూ. 25,000తో రిజర్వ్ చేసుకోవచ్చని కియా ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ గ్వంగులీ తెలిపారు.

కరాటేలో 'ఆదిత్య బిర్లా' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: సుమన్ షోటోకన్ స్పోర్ట్స్ కరాటే డో అకాడమీ ఇండియా ఆధ్వర్యంలో డిసెంబర్ 7న 30వ జాతీయ ఆఫ్లైన్ అండ్ ఆన్లైన్ కరాటే ఛాంపియన్షిప్స్-2025 ఖమ్మంలో నిర్వహించారు. బుధవాడ గ్రామంలో గల అల్ట్రాటెక్ సిమెంట్స్ ఫ్యాక్టరీ వారి ఆదిత్య బిర్లా పబ్లిక్ స్కూల్ నుండి విద్యార్థులు ఈ టోర్నీలో పాల్గొని వివిధ విభాగాలలో పథకాలు సాధించారు. కరాటేలో వి.అభిలాష్, జి.చరణ్ నాయక్, జి. గణేష్, కె. త్రిరుద్ర పసిడి పథకాలను, జి.హరీష్, బి. ప్రణవ్, ఎన్.వినయ్, జి. చరణ్ నాయక్, ఎస్.కీర్తిక వెండి పథకాలను, పి.మణికంఠ, పి. వెంకట షణ్ముఖ సోమేశ్, ఎన్.వినయ్ కుమార్, కె.బాలమహేష్, బి.ప్రణవ్, వి.అభిలాష్, ఎస్.కార్తిక కాంస్య పథకాలు సాధించారు. ఇలాంటి గొప్ప అవకాశం కలిగించినందుకు కరాటే మాస్టర్ శివ, ఆదిత్య బిర్లా పబ్లిక్ స్కూల్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

సిఐటియు మహాసభను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - తిరువూరు : ఈ నెల 31 నుంచి విశాఖపట్నంలో జరుగనున్న సిఐటియు 18వ ఆలిండియా మహాసభను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు అగ్నిపర్తి వెంకటేశ్వరరావు కార్మికులకు పిలుపునిచ్చారు. బుధవారం తిరువూరు జంట సినిమా హాల్స్ సెంటర్‌లో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ మండల నాయకులతో కలిసి ఆయన మహాసభ గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర రావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆలిండియా మహాసభలో కార్యాచరణ తీసుకుంటామన్నారు. తిరువూరు నుండి విశాఖపట్నంకు అధిక సంఖ్యలో ఉద్యోగ కార్మికులు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు ఎస్వీ భద్రం, జిల్లా కార్యదర్శి బి.వెంకటేశ్వరరావు, తిరువూరు మండల బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వేముల రమేష్ (ఏసు), కార్యదర్శి కాసిం, పింగళి శ్రీనివాసరావు, కార్మికులు పాల్గొన్నారు.

విజయవాడలో ట్రిబ్యునల్ కోర్టు ఉండాలి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ట్రిబ్యునల్ కోర్టు విజయవాడలోనే కార్యకలాపాలు నిర్వహించేలా మార్చాలని ముస్లిం జెఎసి రాష్ట్ర కన్వీనర్ మునీర్ అహ్మద్ అన్నారు. ఈ సందర్భంగా బుధవారం వక్ఫ్ బోర్డు సిఇఓను కలిసి వినతి పత్రం అందచేశారు. అనంతరం మునీర్ అహ్మద్ మాట్లాడుతూ ఇప్పటి వరకు ఉమిద్ పోర్టల్‌లో నమోదు చేసిన భూముల వివరాలు అడిగి తెలుసుకున్నామని తెలిపారు. వక్ఫ్ ఆస్తులు ఆరు నెలలు గడువు లోపు ఉమీద్ పోర్టల్‌లో నమోదు చేయాలని కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో చట్టం చేసి ఉమ్మిద్ పోర్టల్ ఏర్పాటు చేసిందన్నారు. డిశంబర్ 6న పోర్టల్ గడువు ముగిసిందని, వక్ఫ్ ఆస్తులు లక్షలలో ఉండగా గడువు లోపు నమోదు ప్రక్రియ పూర్తి కాలేదన్నారు. కొత్తగా నమోదు చేయాల్సిన ఆస్తులు వేలల్లో ఉన్నాయని తెలిపారు. ఇప్పటికీ పోర్టల్లో నమోదు కాని శ్మశాన వాటికలు వేల సంఖ్యలో ఉన్నాయన్నారు. ట్రిబ్యునల్ వ్యవస్థ కర్నూల్‌లో ఉందని, ట్రిబ్యునల్లో శాశ్వత జడ్జి లేనందున రోజు వారి విచారణ జరగటం లేదన్నారు. ఈ నేపథ్యంలో ట్రిబ్యునల్ కోర్టు విజయవాడలో తన కార్యకలాపాలు నిర్వహించేలా మార్చాలని, శాశ్వతంగా జడ్జి నియామకం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని మునీర్ అహ్మద్ విజ్ఞప్తి చేశారు. వినతి పత్రం అందచేసిన వారిలో అబ్దుల్ మతీన్, జనరల్ సెక్రటరీ ముస్లిం అడ్వకేట్ అసోసియేషన్ ముఫ్తీ యూసఫ్ అలీ, మజ్లీసుల్ ఉలేమా అధ్యక్షులు నసీర్ ఉమ్రీ, అహెలే హదీస్ నగర అధ్యక్షులు ముఖ్తార్ అలీ అహెలే సున్నతుల్ జమాత్ ప్రతినిధి ఉన్నారు.

మార్కెట్లోకి గెలాక్సీ జెడ్ ట్రైఫోల్డ్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : శాంసంగ్ ఎలక్ట్రానిక్స్ నూతన ఉత్పత్తి 'గెలాక్సీ జెడ్ ట్రైఫోల్డ్' ను నగర మార్కెట్లోకి తీసుకువచ్చినట్లు సంస్థ ప్రతినిధి ఎం.కుమార్ తెలిపారు. నగరంలోని శాంసంగ్ స్టోర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. మొబైల్ ఏఐ యుగంలో కొత్త రకం డిజైన్లలో శాంసంగ్ తన ఆధిపత్యాన్ని దీని ద్వారా మరింత విస్తరిస్తోందని తెలిపారు. ఫోల్డబుల్ విభాగంలో ఒక దశాబ్దపు ఆవిష్కరణల పునాదిపై ఈ గెలాక్సీ జెడ్ ట్రైఫోల్డ్‌ను నిర్మించారని, మల్టీ-ఫోల్డింగ్ డిజైన్ కోసం ప్రత్యేకంగా రూపొందించిన అత్యంత అధునాతన ఫోల్డబుల్ టెక్నాలజీలతో... ఇది ఇంజనీరింగ్ నైపుణ్యానికి నిదర్శనంగా నిలుస్తుందని తెలిపారు.

నేటి నుంచి భవానీ దీక్షల విరమణ

ప్రజాశక్తి- విజయవాడ సిటీ

బెజవాడలోని ఇంద్రకీలాద్రిపై ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకు భవానీ దీక్షా విరమణలు జరగనున్న నేపథ్యంలో దేవస్థానం, పోలీసులు, వివిధ శాఖలు భారీ ఏర్పాట్లు చేపట్టాయి. ప్రతి ఏటా భవానీల సంఖ్య పెరుగుతుండటంతో ఈసారి మరింత విస్తృతంగా ఏర్పాట్లు చేశారు. భవానీలు ఇరుముడులు సమర్పించేందుకు మొత్తం మూడు హోమగుండాలు ఏర్పాటు చేశారు. భవానీలు 41 రోజులపాటు అనుసరించిన నియమ నిష్టలకు ముగింపు పలకబోతుండటంతో వేలాదిగా భక్తులు తిరిగి ఇంద్రకీలాద్రి చేరుతున్నారు.ఈసారి రాష్ట్రం నలుమూలలల నుంచి 7 లక్షల మంది భవానీలు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.. భక్తులకు మంచినీరు, నిత్యాన్న ప్రసాదం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు అధికారులు.. 19 ప్రసాదం కౌంటర్లు ఏర్పాటు చేసి రద్దీ లేకుండా..భవానీలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు.. మరోవైపు భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.. 4,000 మంది పోలీసు సిబ్బంది భద్రతా ఏర్పాట్లు చేయనుండగా.. 370ం సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేశారు..ఇక, భవానీల రద్దీ దష్ట్యా డిసెంబర్ 11వ తేదీ నుంచి 16వ తేదీ వరకు అన్ని అర్జిత సేవలను నిలిపివేశారు అధికారులు.. భక్తుల సౌకర్యార్థం గిరి ప్రదక్షిణ మార్గం వివరాలు అందించే విధంగా 'భవాని దీక్ష 2025' మొబైల్ యాప్ ను అందుబాటులోకి తెచ్చారు. భవానీలు నిర్వహించే గిరి ప్రదక్షిణ 9 కిలోమీటర్ల మేర సాగనుంది. భక్తుల కోసం ప్రత్యేక క్యూ లైన్లు, ఉచిత క్యూ లైన్లు, పెద్దపీఠాల సౌకర్యాలు అందుబాటులో ఉంచారు.